
దర్శించండి - తరించండి
స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారి దేవస్థానం
కాణిపాకం, ఐరాల (మం), చిత్తూరు జిల్లా.
సత్య ప్రమాణాలకు, ప్రత్యక్ష నిదర్శనం...
శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం శ్రీ స్వామి వారి
శాశ్వత అన్నదాన ట్రస్టులో భాగస్వామ్యం కండి. మీ విరాళాలను ఆన్‌లైన్‌లో కూడా పంపవచ్చు.
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కాణిపాకం బ్రాంచ్
A/c No. 30178925930, IFSC No. SBIN0010105
మరిన్ని వివరాలకు : 08573-281112, 281747



# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176

epaper : https://varthaprabha.com

సమగ్ర వార్తా దినపత్రిక

విజయవాడ, హైదరాబాద్ నుండి ప్రచురణ



SINCE: 1984
చైతన్య కాలేజ్
Cell: 93908 22625
ONE SITTING (For Discontinued)
B.Tech, M.Tech, Diploma
M.B.A, M.C.A, M.Sc, M.A.
B.A, B.Com, B.Sc, B.B.A,
U.G.C. Recog. Universities
10th & Inter TOSS / APOSS / NIOS

డైరెక్టర్: బి.వి. త్రినాథ్ M.A, M.Ed, M.Phil, L.L.B



| విజయవాడ | సంపుటి : 25 | సంచిక : 144 | ది.8-9-2026 | మంగళవారం | పేజీలు : 8 | వెల : రూ.1/- |
|---|---|---|---|---|---|---|
| VIJAYAWADA | Vol.No : 25 | Issue No : 144 | Date : 8-9-2026 | Tuesday | Pages : 8 | Rs.1/- |


### కార్యకర్తలే పార్టీకి బలం.. వారిని ఉన్నతస్థాయికి తీసుకురండి

# లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో చంద్రబాబు

- కార్యకర్తలను రాజకీయంగా, ఆర్థికంగా బలోపేతం చేయాలని ఎమ్మెల్యేలకు సీఎం సూచన
- సమస్యల పరిష్కారంలో మంత్రులు పూర్తి బాధ్యత వహించాలని స్పష్టీకరణ
- స్వర్ణాంధ్ర విజన్-2047ను క్షేత్రస్థాయిలో అమలు చేసి రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలని పిలుపు
- ఆర్థిక ఇబ్బందులున్నా ప్రతి నియోజకవర్గానికి రూ.1 కోటి కేటాయింపు
- టెక్నాలజీతో వందేళ్ల పనిని పదేళ్లలో పూర్తి చేయవచ్చన్న ముఖ్యమంత్రి



**అమరావతి, సెప్టెంబర్ 7 (వార్తాప్రభ) :** తెలుగుదేశం పార్టీ నిర్వహించిన లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు పార్టీ ఎమ్మెల్యేలు, నేతలకు కీలక దిశానిర్దేశం చేశారు. కార్యకర్తల రాజకీయ, ఆర్థిక సాధికారతకు కృషి చేయాలని, అదే సమయంలో స్వర్ణాంధ్ర విజన్-2047ను క్షేత్రస్థాయిలో అమలు చేసి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని స్పష్టం చేశారు. కార్యకర్త బలంగా ఉంటేనే పార్టీ బలంగా ఉంటుందని, వారిని నిరాశకు గురికాకుండా చూడాల్సిన బాధ్యత ఎమ్మెల్యేలదేనని ఆయన ఉద్ఘాటించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. "టీడీపీ కార్యకర్త హుషారుగా ఉంటే గెలుపును ఎవరూ ఆపలేరు. కార్యకర్తల్లో చాలా మంది పేదవారు ఉన్నారు. ప్రభుత్వ పథకాల ఫలాలు వారికి అందేలా చూడాలి. స్థానిక సంస్థల ఎన్నికల్లో బాగా పనిచేసిన వారికి, అక్కడి పరిస్థితులను బట్టి టికెట్లు కేటాయిస్తాం. వారు వ్యాపారాలు చేసుకుని అభివృద్ధి చెందేలా ఎమ్మెల్యేలు ప్రోత్సాహం, మార్గనిర్దేశం అందించాలి. ప్రజలు మెచ్చే విధంగా కార్యకర్తలకు న్యాయం చేస్తాం" అని హామీ ఇచ్చారు. జిల్లాల్లో, నియోజకవర్గాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించే బాధ్యతను మంత్రులు తీసుకోవాలని, లేనిపక్షంలో వారే జవాబుదారీగా ఉండాల్సి వస్తుందని హెచ్చరించారు.

**విజన్-2047తో నియోజకవర్గాల అభివృద్ధి..** స్వర్ణాంధ్ర విజన్-2047 డాక్యుమెంట్‌పై సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా దృష్టి సారించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన విజన్‌కు నియోజకవర్గాల స్థాయిలో ఎమ్మెల్యేలు తమ ఆలోచనలతో విలువ జోడించాలని (వాల్యూ ఎడిషన్) సూచించారు. "విజన్ ప్లాన్ అమలు చేస్తే అభివృద్ధి సాధ్యమవడమే కాదు, ఎన్నికల్లోనూ గెలుపు ఖాయం. పేద-ధనిక మధ్య అంతరాలు తగ్గించడమే ఈ విజన్ ప్రధాన లక్ష్యం. ఆర్థిక కష్టాలు ఉన్నప్పటికీ, ప్రతి నియోజకవర్గానికి రూ.1 కోటి చొప్పున కేటాయించాలని నిర్ణయించాం" అని తెలిపారు. కేంద్ర మంత్రులుగా ఉన్నవారు జాతీయ స్థాయిలో శాఖలను పర్యవేక్షిస్తున్న స్ఫూర్తితోనే తమ జిల్లాలను అభివృద్ధి చేయాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. ప్రజాప్రతినిధుల్లో ఉన్నత విద్యావంతులు, రిటైర్డ్ ఉద్యోగులు, పారిశ్రామికవేత్తలు ఉన్నారని, వారంతా తమ అనుభవంతో విజన్ డాక్యుమెంట్లను అధ్యయనం చేసి, వినూత్నంగా ఆలోచించాలని కోరారు. "వందేళ్లలో జరిగే పనులను పదేళ్లలో పూర్తి చేసే టెక్నాలజీ ఇప్పుడు అందుబాటులో ఉంది. ప్రతి ఎమ్మెల్యే అకుంఠిత దీక్షతో పనిచేస్తే అద్భుతాలు సృష్టించవచ్చు" అని చంద్రబాబు అన్నారు. పెట్టుబడులను ఆకర్షించేందుకు 28 కొత్త పాలసీలు తీసుకొచ్చినట్లు ఆయన గుర్తుచేశారు.

# తెలంగాణలో కోటి ఓట్ల తొలగింపునకు కుట్ర: సీఎం రేవంత్ రెడ్డి

- బీజేపీ వ్యతిరేక ఓట్లపై ప్రత్యేక నిఘా ఉందని ఆరోపణ
- కొడంగల్‌లో 81 వేల ఓట్లు అనామలీస్ జాబితాలో ఉన్నాయని వెల్లడి
- 2029లో మోదీ ఓటమికి పునాది అన్న సీఎం
- పేదలు, గిరిజనుల ఓట్లపైనా కుట్ర జరుగుతోందని ఆరోపణ
- లౌకిక శక్తులు ఏకం కావాలని రేవంత్ పిలుపు



**హైదరాబాద్,సెప్టెంబర్ 7 (వార్తాప్రభ) :** తెలంగాణలో కోటి ఓట్లను తొలగించే కుట్ర జరుగుతోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. ఓటర్ల జాబితా సవరణ (సర్) ప్రక్రియపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వ్యతిరేక ఓటర్లను గుర్తించేందుకు బీజేపీ ప్రత్యేక ఏజెన్సీలను ఏర్పాటు చేసిందని విమర్శించారు. 2009 నుంచి ఓటింగ్ సరళిని పరిశీలించి బీజేపీకి వ్యతిరేకంగా ఉన్నవారి ఓట్లు తొలగిస్తున్నారని ఆరోపించారు. రవీంద్రభారతిలో నేడు రైతు నేత సారంపల్లి మల్లారెడ్డి సంస్మరణ సభ జరిగింది. ఈ కార్యక్రమంలో సీఎం మాట్లాడారు. నరేంద్ర మోదీ విధానాలకు వ్యతిరేకంగా వ్యవస్థ మొత్తం సిద్ధమవుతోందని అన్నారు. అందుకే ఎస్ఐఆర్ పేరుతో కొత్త కుట్రలకు తెరలేపారని ఆరోపించారు. తెలంగాణలో కోటి ఓట్లు తొలగిస్తున్నా బీఆర్ఎస్ స్పందించడం లేదని మండిపడ్డారు.

**కొడంగల్‌లో 81 వేల ఓట్లు..** తన నియోజకవర్గం కొడంగల్‌లో వలస వెళ్లిన వేలాది మంది పేదల ఓట్లను తొలగిస్తున్నారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. కొడంగల్‌లో 81 వేల ఓట్లను అనామలీస్ జాబితాలో చేర్చారని తెలిపారు. ప్రస్తుత ఓట్లతోనే 2029లో మోదీ ఓటమికి పునాది పడుతుందని అన్నారు. బీజేపీ వ్యతిరేక ఓట్లు అంటే మైనార్టీలవే అనుకోవద్దని సీఎం చెప్పారు. పేదలు, గిరిజనుల ఓట్లను తొలగించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. జాతీయ స్థాయిలో లౌకిక శక్తులు ఏకమై మోదీకి వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు.

**సారంపల్లి సేవలు చిరస్మరణీయం..** రైతుల కోసం జీవితాన్ని అంకితం చేసిన సారంపల్లి మల్లారెడ్డి మరణం రైతాంగానికి తీరని లోటని సీఎం అన్నారు. రైతు సమస్యలపై అవగాహన ఉన్న నాయకత్వం క్రమంగా తగ్గుతోందని పేర్కొన్నారు. కౌలు రైతులు, గిట్టుబాటు ధరలు సహా అనేక రైతు సమస్యలపై సారంపల్లికి అపారమైన అవగాహన ఉందని కొనియాడారు. కమ్యూనిస్టు ఉద్యమాల పోరాటాల వల్లే కాంగ్రెస్ పలు చట్టాలు తీసుకొచ్చిందని రేవంత్ రెడ్డి అన్నారు. కార్మికులు, పేదల సమస్యలపై కమ్యూనిస్టులు చేసిన పోరాటాలు తమ ప్రభుత్వ ఏర్పాటుకు ప్రత్యక్షంగా, పరోక్షంగా దోహదపడ్డాయని చెప్పారు.

# ప్రజలకు తక్కువ ధరకే నాణ్యమైన బియ్యం, సరుకులు

- ఏపీ భవన్‌లో ప్రత్యేక రైస్ అవుట్‌లెట్ ప్రారంభించిన మంత్రి నాదెండ్ల మనోహర్
- రాష్ట్ర ప్రజలతో పాటు ఇతర రాష్ట్రాలకూ అత్యుత్తమ నాణ్యతతో కూడిన సరుకులు అందజేత.
- కేఎన్ఎం, బీపీటీ వంటి రకరకాల బియ్యం వెరైటీలు అందుబాటులో ఉంచేలా చర్యలు.
- ఎన్‌సీసీఎఫ్ ద్వారా 64 రకాల నిత్యావసర సరుకులు సబ్సిడీ ధరలతో విక్రయం.



**న్యూఢిల్లీ,సెప్టెంబర్ 7 (వార్తాప్రభ) :** దేశ రాజధాని న్యూఢిల్లీలో నివసిస్తున్న రాష్ట్ర ప్రజలకు తక్కువ ధరకే అత్యుత్తమ నాణ్యతతో కూడిన బియ్యం, నిత్యావసర సరుకులను అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం కీలక అడుగు వేసింది. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్ పౌరసరఫరాల కార్పొరేషన్ ఆధ్వర్యంలో, రెసిడెంట్ కమిషనర్ చొరవతో ఏపీ భవన్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక 'రైస్ అవుట్‌లెట్'ను పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ.. మన రైతాంగం కష్టపడి పండించిన ధాన్యం రాష్ట్రవ్యాప్తంగానే కాకుండా జాతీయ స్థాయిలోనూ అద్భుతమైన గుర్తింపు తెచ్చుకుందని కొనియాడారు. ముఖ్యంగా ఢిల్లీ నగరంలో స్థిరపడిన, నివసిస్తున్న తెలుగు ప్రజలందరికీ స్వచ్ఛమైన, నాణ్యమైన మన ఊరి రుచులను, వరి వంగడాలను అందించాలనే ఉద్దేశంతోనే ఈ అవుట్‌లెట్‌ను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు ఆయన వెల్లడించారు. రాబోయే రోజుల్లో ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేలా పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని మంత్రి స్పష్టం చేశారు. కేఎన్ఎం, బీపీటీ వంటి వివిధ రకాల బియ్యం వెరైటీలతో పాటు, ఎన్‌సీసీఎఫ్ ద్వారా సేకరించిన 64 రకాల నాణ్యమైన సరుకులను కూడా సబ్సిడీ రేట్లతో ఈ కౌంటర్ ద్వారా విక్రయించనున్నట్లు తెలిపారు. ప్రజలకు అందించే ఈ సేవల్లో ఎటువంటి లోపాలు తలెత్తకుండా అర్హత గల నిపుణులను నియమించి పారదర్శకంగా సేవలు అందిస్తామని మంత్రి ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో ఏపీ భవన్ స్పెషల్ కమిషనర్ అర్జా శ్రీకాంత్, ప్రభుత్వ సలహాదారు ఏకే జైన్, ఏపీ భవన్ అధికారులు, మీడియా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ నీటి కష్టాలకు ఎల్‌నినోతోడు కేసీఆర్ వైఫల్యాలు

- రూ.1.81 లక్షల కోట్లు ఖర్చుచేసినా అసంపూర్తిగానే సాగునీటి ప్రాజెక్టులు
- పాలమూరు--రంగారెడ్డిపై 90 శాతం పనులు పూర్తయ్యాయనడం పచ్చి అబద్ధం
- గడిచిన మూడు జల సంవత్సరాల్లో కృష్ణా న్యాయవాటాను సమర్థంగా వినియోగించుకున్నాం
- ప్రధాన పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేస్తాం
- శాస్త్రీయ పద్ధతుల్లో కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణ
- తెలంగాణ నదీజల హక్కుల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదు
- మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి



**హైదరాబాద్,సెప్టెంబర్ 7 (వార్తాప్రభ) :** తెలంగాణలో ప్రస్తుతం నెలకొన్న నీటి సమస్యకు ఒకవైపు ప్రపంచవ్యాప్తంగా ప్రభావం చూపుతున్న ఎల్‌నినో వాతావరణ పరిస్థితులు కారణమైతే, మరోవైపు గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సాగునీటి రంగంలో చోటుచేసుకున్న వైఫల్యాలు ప్రధాన కారణమని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖల మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. శాసనసభ లాబీల్లో సోమవారం మీడియా ప్రతినిధులతో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చిట్-చాట్ నిర్వహించారు. ప్రకృతి సృష్టించిన ప్రతికూల పరిస్థితులకు గత ప్రభుత్వ అసమర్థ సాగునీటి విధానాలు తోడవడంతోనే రాష్ట్రంలో నీటి ఎద్దడి తీవ్రరూపం దాల్చిందన్నారు. "తెలంగాణ రైతులు ప్రస్తుతం ఎదుర్కొంటున్న ఇబ్బందులకు ఇద్దరే కారణం... ఒకరు మిస్టర్ ఎల్‌నినో, మరొకరు మిస్టర్ కేసీఆర్" అని ఆయన వ్యాఖ్యానించారు. ఎల్‌నినో అనేది పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడే మార్పుల కారణంగా ప్రపంచవ్యాప్తంగా వర్షపాతం, నీటి లభ్యతపై ప్రభావం చూపే అంతర్జాతీయ వాతావరణ పరిణామమని వివరించారు. దానిని తెలంగాణ ప్రభుత్వం సృష్టించలేదని, దాని ప్రభావం ఒక్క తెలంగాణకే పరిమితం కాలేదని గుర్తుచేశారు. నీటి లభ్యత తగ్గే అవకాశాలను ముందుగానే అంచనా వేసిన ప్రభుత్వం, నీటి వసతి అనిశ్చితంగా ఉన్న ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని రైతులకు పలుమార్లు సూచించిందన్నారు.

**రాజకీయ భాషా ప్రమాణాలను దిగజార్చింది కేసీఆరే..** తెలంగాణ రాజకీయాల్లో భాషా ప్రమాణాలు దిగజారడానికి కేసీఆరే కారణమని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. "కేసీఆర్‌కు ముందు రాజకీయ నాయకులు ఈ తరహా భాషను ఉపయోగించేవారు కాదు. ఒకప్పుడు వీరత్వంగా ప్రచారం చేసుకున్న మాటలే ఇప్పుడు రాజకీయ సంభాషణను కలుషితం చేశాయి" అని పేర్కొన్నారు. అయితే బీఆర్ఎస్‌పై తమ ప్రధాన విమర్శ రాజకీయ భాషకు మాత్రమే పరిమితం కాదని, సాగునీటి రంగంలో ఆ ప్రభుత్వం ప్రదర్శించిన ఘోర వైఫల్యమే అసలు అంశమని స్పష్టం చేశారు.

**రూ.1.81 లక్షల కోట్లు ఖర్చు చేసినా ప్రాజెక్టులు పూర్తి కాలేదు..** తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో సాగునీటి రంగంపై సుమారు రూ.1.81 లక్షల కోట్లు ఖర్చు చేసినట్లు చెప్పుకున్నప్పటికీ, రాష్ట్ర ఆవిర్భావ సమయానికి పెండింగ్‌లో ఉన్న ప్రధాన ప్రాజెక్టులలో ఒక్కదానినీ సంపూర్ణంగా పూర్తి చేయలేకపోయారని మంత్రి ఉత్తమ్ విమర్శించారు. కల్వకుర్తి, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్, భీమా, ఎస్ఎల్‌బీసీ సొరంగం వంటి కీలక ప్రాజెక్టులు భారీగా నిధులు వెచ్చించినప్పటికీ అసంపూర్తిగానే మిగిలిపోయాయని పేర్కొన్నారు.


కోర్టు ప్రకటన

In the Court of the II Addl. Civil judge (Junior division) at Vijayawada

O.S No: 215/2024

Between:-

Anu vartha Dresses, Rep by Propretrix Veena Gulchha.....Plaintiff

And

Dubaguntla Veera Venkata Ramesh babu, Propritor of Vijaya Vasavi Showroom, Khabhampadu (V) G.Konduru mandal, NTR Distict. .......Defendant

పై నెంబరు దావా నందు మీకు నోటీసును అందజేయు నిమిత్తం ది.24-09-2026వ తేదికి వాయిదా అయివున్నది. కనుక మీరు సదరు వాయిదా రోజు ఉదయం 10.30ని॥లకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, మీ న్యాయవాది ద్వారా గాని, హాజరై ఏమైన ఆక్షేపణలు వున్నయెడల తెలుపు కొనవలెను. లేనియెడల మీ పరోక్షమున విచారించి తీర్మానించెదరని యిందు మూలంగా తెలియజేయడమైనది.

(శ్రీకోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదా తేది 24-09-2026

ఇట్లు:-
కె. సత్యనారాయణరావు,
కె.వి.యస్.యన్.డి లక్ష్మి బాయి
వాది తరుపున న్యాయవాదులు,
విజయవాడ-10,ఫోన్ : 9951555678


# స్వచ్ఛతతో స్వర్ణాంధ్ర దిశగా అడుగులు

- జిల్లా కలెక్టరేట్‌లో ఘనంగా స్వర్ణాంధ్ర--స్వచ్ఛాంధ్ర ర్యాలీ
- కార్యక్రమ విశిష్టతను చాటిచెప్పిన జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ







**విజయవాడ, సెప్టెంబర్ 7 (వార్తాప్రభ) :** సోమవారం జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో జిల్లా పంచాయతీ కార్యాలయం ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర--స్వచ్ఛాంధ్ర ర్యాలీని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ డా. జి. లక్ష్మీశ.. జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియ, వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. స్వర్ణాంధ్ర--స్వచ్ఛాంధ్ర కార్యక్రమం ద్వారా పరిశుభ్రత, పారిశుద్ధ్యం, పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించడమే ప్రధాన లక్ష్యమని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. స్వచ్ఛతను ప్రజల దైనందిన జీవితంలో భాగంగా మార్చేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు. స్వచ్ఛమైన పరిసరాలు, పరిశుభ్రమైన వాతావరణం ఉంటేనే ప్రజలు ఆరోగ్యంగా జీవించగలరని కలెక్టర్ పేర్కొన్నారు. పరిశుభ్రత, పచ్చదనం, పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ బాధ్యతగా వ్యవహరించినప్పుడే ఆరోగ్యవంతమైన సమాజంతో పాటు స్వర్ణాంధ్ర నిర్మాణం సాధ్యమవుతుందని తెలిపారు. ర్యాలీలో పాల్గొన్న అధికారులు, సిబ్బంది ప్లకార్డులు, బ్యానర్లతో ప్రజలకు అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వినియోగం నివారణ, చెత్త నిర్వహణ, డ్రైనేజీల్లో చెత్త వేయకుండా చూడటం, పచ్చదనం పెంపొందించడం వంటి అంశాలపై నినాదాలు చేస్తూ స్వచ్ఛత సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లారు. ప్లాస్టిక్ కవరు వాడకు... ప్రాణాలను తీయకు.. అనే నినాదంతో ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు వివరించారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి, పునర్వినియోగ వస్తువులను వినియోగించాలని సూచించారు. తడి, పొడి చెత్త నుండి ఎరువు... చేస్తే ఉండదు బరువు అంటూ చెత్తను తడి, పొడి చెత్తగా వేరు చేసి నిర్వహించాల్సిన ఆవశ్యకతను వివరించారు. తడి చెత్తను సక్రమంగా వినియోగిస్తే సేంద్రియ ఎరువుగా మార్చుకోవచ్చని, తద్వారా చెత్త సమస్యను తగ్గించవచ్చని అవగాహన కల్పించారు. డ్రైన్లలో చెత్త వేయకు... దోమలకు ఇల్లు కట్టకు.. అనే నినాదంతో డ్రైనేజీల్లో చెత్త వేయకుండా ప్రజలు సహకరించాలని కోరారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా దోమల వ్యాప్తిని నియంత్రించి ప్రజారోగ్యాన్ని కాపాడవచ్చని తెలిపారు. పచ్చదనం... ప్రకృతి ధనం.. అనే సందేశంతో మొక్కలు నాటడం, వాటిని సంరక్షించడం, పచ్చదనాన్ని పెంపొందించడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించాలని సూచించారు. ప్రతి ఒక్కరి భాగస్వామ్యంతోనే స్వచ్ఛాంధ్ర.. ప్రతి ఒక్కరూ తమ ఇళ్లతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. చెత్తను నిర్దేశిత విధానంలో నిర్వహించడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం వంటి అంశాల్లో ప్రజలు స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీపీవో సీతా మహాలక్ష్మి, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఏపీలో పదో తరగతి అర్హతతో 913 ఉద్యోగాలు

- ఈ నెలాఖరులోగా నియామకాలు పూర్తి చేయాలని ఆదేశం
- ఇప్పటికే 1,294 పోస్టులను భర్తీ చేసినట్టు మంత్రి వెల్లడి
- అర్హత: 10వ తరగతి, 25-45 ఏళ్ల వయసు, స్థానిక మహిళలు

**అమరావతి,సెప్టెంబర్ 7 (వార్తాప్రభ) :** ఆంధ్రప్రదేశ్‌లో ఉద్యోగాల కోసం నిరీక్షిస్తున్న మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం తీపికబురు అందించింది. రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న 913 ఆశా కార్యకర్తల పోస్టులను భర్తీ చేయనున్నట్లు వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ ప్రకటించారు. ఈ నియామక ప్రక్రియను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్లు ఆయన వెల్లడించారు. ఈ నియామకాలను జిల్లా కలెక్టర్ల అధ్యక్షతన ఉండే జిల్లా ఆరోగ్య సొసైటీల ద్వారా చేపట్టనున్నారు. ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. అలాగే, దరఖాస్తుదారుల వయసు 25 నుంచి 45 ఏళ్ల మధ్య ఉండటం తప్పనిసరి. సంబంధిత గ్రామాలు లేదా వార్డులకు చెందిన స్థానిక మహిళలకు ఈ నియామకాల్లో ప్రాధాన్యత కల్పించనున్నారు. ఎంపికైన ఆశా కార్యకర్తలకు నెలకు రూ.10,000 చొప్పున గౌరవ వేతనం లభిస్తుంది. రాష్ట్రంలో ఇప్పటికే 1,294 ఆశా కార్యకర్తల పోస్టులను భర్తీ చేశామని మంత్రి సత్యకుమార్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. తాజాగా మరో 913 పోస్టుల భర్తీకి ఆమోదం తెలిపామని, వీటిని కూడా త్వరితగతిన పూర్తి చేసి క్షేత్రస్థాయిలో వైద్య సేవలను మరింత బలోపేతం చేస్తామని ఆయన వివరించారు. ప్రభుత్వ నిర్ణయంతో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజారోగ్య సేవలు మరింత మెరుగుపడనున్నాయి.

# ప్రజల హక్కుల పరిరక్షణ కు ఎల్లప్పుడూ అండగా నిలుస్తాం.

**జిల్లా కౌన్సిల్ సభ్యులు గుండె గణేష్ ముదిరాజ్**



**శేరిలింగంపల్లి,సెప్టెంబర్ 7 (వార్తాప్రభ):**తెల్లవారుజామున 4 గంటలకు ఒక పౌరుడిని అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని జిల్లా కౌన్సిల్ సభ్యులు గుండె గణేష్ ముదిరాజ్ అన్నారు.ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడి హక్కులు, గౌరవం, స్వేచ్ఛను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు.చట్టం అందరికీ సమానంగా వర్తించాలని, అధికారాన్ని అడ్డుపెట్టుకుని ప్రజలను భయపెట్టడం, వారి గొంతును అణచివేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని గుండె గణేష్ ముదిరాజ్ అన్నారు.అరెస్టుకు సంబంధించిన పూర్తి వివరాలను అధికారులు వెంటనే ప్రజలకు వెల్లడించాలని, చట్టబద్ధమైన ప్రక్రియను పారదర్శకంగా పాటించాలని డిమాండ్ చేశారు.అన్యాయం ఎక్కడ జరిగినా ప్రశ్నిస్తామని, ప్రజల హక్కుల పరిరక్షణకు ఎల్లప్పుడూ అండగా నిలుస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మియాపూర్ డివిజన్ అధ్యక్షులు ఏ. లక్ష్మణ్, నాగేశ్వర్ గౌడ్, మక్తా డివిజన్ అధ్యక్షులు జె. శ్రీను, ఆర్.ఆర్. జిల్లా ఎస్టీ మోర్చా అధ్యక్షులు జి. విజేందర్, జిల్లా ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షులు ప్రభాకర్, జిల్లా దివ్యాంగుల కన్వీనర్ పి. నాగులు, సీనియర్ నాయకులు పాపయ్య, కె. ప్రసాద్, బాలరాజ్ పాల్గొన్నారు.

# కుత్బుల్లాపూర్‌లో బీఆర్ఎస్ పోరుబాట

**అధికారులకు వినతిపత్రం అందజేత**

**ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలం:**

**బీఆర్ఎస్ నేతల ఆగ్రహం**

**జోనల్, డిప్యూటీ కమిషనర్లకు వినతిపత్రం**

**అందజేసిన కుంట సిద్దిరాములు బృందం**





**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 7, (వార్తాప్రభ)** : ప్రభుత్వం ఏర్పడి వేయి రోజులు గడిచినా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని ఆరోపిస్తూ కుత్బుల్లాపూర్‌లో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పోరుబాట చేపట్టారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్‌లకు పార్టీ ప్రతినిధులు అసంతృప్తి వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 132 డివిజన్ బీఆర్ఎస్ పార్టీ జనరల్ సెక్రటరీ, సీనియర్ నాయకుడు కుంట సిద్దిరాములు మాట్లాడారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం, ఇచ్చిన హామీల అమలు కోసం బీఆర్ఎస్ పార్టీ తరపున క్షేత్రస్థాయి పోరాటాన్ని మరింత బలోపేతం చేస్తామని స్పష్టం చేశారు. స్థానిక సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించకపోతే ప్రజా ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సమ సమాజ నిర్మాణంలో... ఉపాధ్యాయుల పాత్ర కీలకం.

**మాజీ ప్రొఫెసర్ దయానందం.**




**జవహర్ నగర్ సెప్టెంబర్ 7 (వార్తా ప్రభ):** సమ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని ఆధునిక కాలంలో విద్యార్థులు ఆటలకు దూరం అవుతూ.... తరచూ ఫోన్లు చూస్తూ మానసికంగా కృంగిపోతున్నారని విద్యార్థులను సరైన మార్గంలో నడిపేది ఉపాధ్యాయులేనని మాజీ ప్రొఫెసర్ దయానందం అన్నారు. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ చంద్రపురి కాలనీ డివిజన్ అరుంధతి నగర్ సిఆర్పిఎఫ్ క్యాంపస్ లో ఉపాధ్యాయులకు సోమవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ ప్రొఫెసర్ దయానందం హాజరై మాట్లాడుతూ నవ సమాజ నిర్మాణానికి తల్లిదండ్రులు ఉపాధ్యాయుల భాగస్వామ్యం ఎంతో అవసరమని అన్నారు. ఉపాధ్యాయులు నిత్య కృషి వలురుగా రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అపర్ణ, వైస్ ప్రిన్సిపాల్ హరిశంకర్, హెచ్ఎం ఆశాజికుమార్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# వంద పడకల "మదర్ అండ్ చైల్డ్" ఆసుపత్రి శుభారంభం

**ప్రారంభోత్సవంలో పాల్గొన్న శేరిలింగంపల్లి అతిరథమహారథులు**



**శేరిలింగంపల్లి,సెప్టెంబర్ 7 (వార్తాప్రభ):**మదీనాగూడలోని ప్రణామ్ హాస్పిటల్స్ నూతన భవనంలో 100 పడకల 'మదర్ అండ్ చైల్డ్' ఆసుపత్రిని ఆదివారం ప్రారంభించారు. పీఏసీ చైర్మన్,శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్ గౌడ్, బీజేపీ నాయకులు రవికుమార్ యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు.ఈ సందర్భంగా అరెకపూడి గాంధీ మాట్లాడుతూ డాక్టర్ మనీష్ బృందం అత్యాధునిక సౌకర్యాలతో ఆసుపత్రిని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు.మూడు అత్యాధునిక ఆపరేషన్ థియేటర్లు, 100 పడకల సామర్థ్యంతో పాటు అనుభవజ్ఞులైన వైద్యుల సేవలు అందుబాటులోకి తీసుకురావడం ప్రశంసనీయమన్నారు.ప్రణామ్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ మనీష్ గౌర్, ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ ప్రజ్ఞా శ్రీవాస్తవ మాట్లాడుతూ మహిళలు, చిన్నారులకు ప్రత్యేక వైద్య సేవలు అందించేందుకు నూతన భవనాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆసుపత్రిలో ఐసీయూ, ఎన్ఐసీయూ, పీఐసీయూ, మెటర్నల్ ఐసీయూ, ఆధునిక ఆపరేషన్ థియేటర్లు, సూట్ రూమ్‌లను ఏర్పాటు చేసినట్లు వివరించారు.అందుబాటు ధరల్లో నాణ్యమైన వైద్య సేవలు అందిస్తూ ఫ్యామిలీ హాస్పిటల్‌గా ప్రజల విశ్వాసాన్ని పొందడమే లక్ష్యమని తెలిపారు. భవిష్యత్తులో టైర్-2, టైర్-3 నగరాలకు సేవలను విస్తరించనున్నట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ కృష్ణ ప్రసాద్, మనోజ్, సీఓఓ గీతా భవాని, ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

# అనధికార నిర్మాణాలపై సీఎంసి అధికారుల కొరడా

**16 అక్రమ నిర్మాణాలను కూలగొట్టిన అధికారులు**




**శేరిలింగంపల్లి,సెప్టెంబర్ 7 (వార్తాప్రభ):**అనధికార నిర్మాణాలపై సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) అధికారులు కొరడా ఝుళిపించారు.భవన నిర్మాణ నిబంధనల అమలులో భాగంగా మూడు జోన్ల పరిధిలో సోమవారం క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యలు చేపట్టారు.ఈ సందర్భంగా 15 అనధికార నిర్మాణాలను గుర్తించగా.. 16 నిర్మాణాలను కూల్చివేశారు.మరో రెండు నోటీసులు జారీ చేసి, ఒక అనధికార నిర్మాణాన్ని సీజ్ చేశారు.జోన్‌ల వారీగా కూల్చివేతలు ఇలా శేరిలింగంపల్లి జోన్‌లో 5, కూకట్‌పల్లి జోన్‌లో 4, కుత్బుల్లాపూర్ జోన్‌లో 7 నిర్మాణాలను కూల్చివేశారు.అనధికార నిర్మాణాలను గుర్తించిన దశ నుంచి ఎన్‌ఫోర్స్‌మెంట్ వరకు నిర్దేశిత విధానాల ప్రకారం చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను సీఎంసీ కమిషనర్ ఆదేశించారు.మూడు జోన్లలో సీఎంసీ బృందాలు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ కొనసాగిస్తున్నాయి.గుర్తించిన అనధికార నిర్మాణాలపై నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు.

# మాజీ సైనికులకు టీటీడీలో ఉద్యోగ అవకాశాలు

**- సెప్టెంబర్ 9న విజయవాడలో ఎంపిక ప్రక్రియ**

**- జిల్లా సైనిక సంక్షేమ అధికారి వై.ఈశ్వరరావు**

**విజయవాడ, సెప్టెంబర్ 07::(వార్తా ప్రభ ప్రతినిధి)**కృష్ణా, ఎన్‌టీఆర్ జిల్లాల్లో నివసిస్తున్న మాజీ సైనికులకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ), తిరుమలలో సెక్యూరిటీ ఎగ్జిక్యూటివ్‌గా ఉద్యోగం పొందే అవకాశం కల్పిస్తున్నట్లు ఇన్‌చార్జ్ జిల్లా సైనిక సంక్షేమ అధికారి వై.ఈశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఆర్మీ వెల్ఫేర్ ప్లేస్‌మెంట్ ఆర్గనైజేషన్ (సికింద్రాబాద్).. ఏపీ సైనిక్ సంక్షేమ శాఖ సహకారంతో కృష్ణా, ఎన్‌టీఆర్, గుంటూరు, బాపట్ల, ఏలూరు, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు చెందిన మాజీ సైనికుల కోసం ఈ ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సెక్యూరిటీ ఎగ్జిక్యూటివ్ పోస్టులకు ఎంపిక ప్రక్రియ సెప్టెంబర్ 9న ఉదయం 6 గంటల నుంచి విజయవాడ మొగల్రాజపురంలోని పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో ప్రారంభమవుతుందని తెలిపారు. ఎంపికై విధుల్లో చేరే సమయానికి అభ్యర్థి వయస్సు 50 సంవత్సరాలు మించరాదని పేర్కొన్నారు. అర్హత కలిగిన మాజీ సైనికులు స్పోర్ట్స్/రన్నింగ్ షూస్‌తో ఎంపిక ప్రక్రియకు హాజరు కావాలని సూచించారు. ఎంపిక ప్రక్రియకు హాజరయ్యే మాజీ సైనికులు ఒరిజినల్ ఆధార్ కార్డు, పాన్ కార్డు, మాజీ సైనికుని ఐడీ కార్డు, డిశ్చార్జ్ బుక్, బ్యాంక్ పాస్‌బుక్, పదో తరగతి మార్కుల మెమో, 8 ఒరిజినల్ పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు తీసుకురావాలన్నారు. అన్ని ధ్రువపత్రాలకు రెండు సెట్ల జిరాక్స్ కాపీలు కూడా వెంట తీసుకురావాలని సూచించారు. ఎంపికైన మాజీ సైనికులకు నెలకు రూ. 24,743 వేతనంతో పాటు ఉచిత సింగిల్ వసతి కల్పించనున్నట్లు తెలిపారు. అర్హత కలిగిన మాజీ సైనికులు ఈ ఉద్యోగ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జ్ జిల్లా సైనిక సంక్షేమ అధికారి వై.ఈశ్వరరావు కోరారు.

# స్మార్ట్ మీటర్ ప్రాజెక్టులో రూ.2500 కోట్ల అక్రమ చెల్లింపులు

**సెప్టెంబర్ 07,**

**- న్యాయ విచారణ జరపండి**

**- రద్దు ఒప్పందాన్ని బహిరంగపర్చండి**

**- సిపిఎం రాష్ట్రకార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్**




**అమరావతి సెప్టెంబర్ 07::(వార్తా ప్రభ ప్రతినిధి)** : వ్యవసాయ స్మార్ట్ మీటర్ల ప్రాజెక్టులో రాష్ట్రంలో 2,500 కోట్ల రూపాయలు అక్రమ చెల్లింపులు జరిగాయని, న్యాయవిచారణ జరిపి ఆ మొత్తాన్ని తిరిగి రాబట్టాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. విజయవాడలోని ఎంబి విజ్ఞాన కేంద్రంలో ఆ పార్టీ రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావుతో కలిసి ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలోని మూడు డిస్కమ్‌లు మీటర్లు, అనుబంధ, సాఫ్ట్‌వేర్ ఖర్చుల పేరుతో షిర్డీ సాయి కంపెనీకి ఆ మొత్తాన్ని చెల్లించాయని ఆయన చెప్పారు. ఒక్క ఎపిఎస్‌పిడిసిఎల్ సంస్థే స్మార్ట్ మీటర్ల ఒప్పందం రద్దు చేసుకున్నందుకు షిర్డీ సాయి కంపెనీకి పరిహారంగా రూ.764 కోట్లు అక్రమంగా చెల్లించిందని విమర్శించారు. దీనికి ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఎపిఇఆర్‌సి) అనుమతి లేదని, బహిరంగ విచారణ కూడా జరపకుండా రహస్యంగా డబ్బులు చెల్లించారని తెలిపారు. మిగిలిన రెండు డిస్కమ్‌లు కూడా ఇదే విధంగా చెల్లింపులు చేశాయన్నారు. వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు బిగించేందుకు వైసిపి హయాంలో షిర్డీ సాయి సంస్థతో ఒప్పందం కుదిరిందని తెలిపారు. మీటర్లు పెట్టకముందే రూ.1800కోట్లు అక్రమంగా ఆ కంపెనీకి గత ప్రభుత్వం చెల్లించిందన్నారు. ఈ అంశంపై రైతు సంఘాలు తీవ్రంగా వ్యతిరేకించి పెద్దఎత్తున ఆందోళనలు నిర్వహించడంతో మీటర్ల ఏర్పాటు నిర్ణయాన్ని నిలిపివేశారని తెలిపారు. అప్పట్లో ఈ స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా టిడిపి నాయకులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి హైకోర్టులో పిటిషన్ వేశారని గుర్తు చేశారు. ఆ ఒప్పందం రద్దు పేరిట కూటమి ప్రభుత్వం షిర్డీ సాయి ఎలక్ట్రికల్ కంపెనీకి రూ.764కోట్లు చెల్లించడం అక్రమమని అన్నారు. అంత రహస్యంగా చెల్లించాల్సిన అవసరం ఏమిటని ప్రశ్నించారు. ప్రతిపక్షంలో ఉండగా స్మార్ట్‌మీటర్లు, సెకీ ఒప్పందాన్ని తీవ్రంగా వ్యతిరేకించిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు వాటినే కొనసాగిస్తోందని విమర్శించారు. విద్యుత్ రంగాన్ని అదానీ, షిర్డీ సాయి కంపెనీలు లూటీ చేస్తున్నాయని, రాష్ట్ర విద్యుత్ రంగంలోనూ వాటి హవానే కొనసాగుతోందని చెప్పారు. ఎన్నికల సమయంలో ఆ సంస్థ ఎలక్టోరల్ బాండ్ల రూపంలో టిడిపి, వైసిపిలకు అధికారికంగా పెద్దఎత్తున డబ్బులు ఇచ్చిందని గుర్తుచేశారు. అనధికారికంగా ఎన్ని లావాదేవీలు జరిగితే ఇన్ని వేల కోట్ల రూపాయలు ఈ కంపెనీకి చెల్లించారని అనుమానం వ్యక్తం చేశారు. వ్యవసాయ పంపుసెట్లకు స్మార్ట్ మీటర్ల నిర్ణయాన్ని రద్దు చేసుకున్న ఒప్పందాన్ని బయటపెట్టాలని, ఎంత డబ్బులు చెల్లించారో చెప్పాల ని కోరారు. లేదంటే ఆ కంపెనీకి ప్రభుత్వ నేతలకు మధ్య అక్రమ లావాదేవీలు జరిగాయని చెప్పాల్సి ఉంటుందన్నారు. ఇతర రాష్ట్రాల్లో రూ.3,000-4,000 పరిధిలో ఉన్న మీటర్లకు రాష్ట్రంలో మాత్రం రూ.34,000 పైగా ఖర్చు పెట్టారని తెలిపారు. రైతులకు, ప్రజలకు ఏమాత్రం ప్రయోజన కరం కానీ స్మార్ట్ మీటర్లు బిగించి ప్రజా ధనాన్ని కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టడం వారి దగ్గర నుండి ఎన్నికల కోసం డబ్బులు తీసుకొని అవినీతికి పాల్పడడం తీవ్ర నేరమని చెప్పారు. టర్మినేషన్ అమౌంట్ వివరాల ఒప్పందాన్ని బహిర్గత పరచాలని, పూర్తి చెల్లింపు లెక్కలు ప్రజల ముందు పెట్టాలని, అక్రమ చెల్లింపులపై న్యాయ విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

**ఏజెన్సీలో పిల్లల ప్రాణాలు కాపాడాలి** పోలవరం జిల్లా చింతూరు సబ్‌డివిజన్‌లో వారం రోజుల తేడాలో మృతిచెందిన ముగ్గురు బాలికల మరణాలకు కారణాలు వెల్లడించాలని, వారి కుటుంబాలను ఆదుకోవాలని శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఎటపాక మండలం గొల్లగుట్టలో రాష్ట్రప్రభుత్వం గిరిజన ప్రజలకు, బాలబాలికలకు పంపిణీ చేసిన మలేరియా మాత్రలు వికటించి 40 మంది ఆస్పత్రిపాలయ్యారని తెలిపారు. వీరిలో జమున అనే అమ్మాయి మృతి చెందడం బాధాకరమని అన్నారు. 'దీనికి ముందు అదే గ్రామంలో రోజా అనే అమ్మాయి కూడా మరణించింది. ఐదు రోజుల క్రితం కూనవరం మండలంలో మరొక విద్యార్థిని వాంతులు చేసుకొని చనిపోయింది. ఈ మరణాలు అత్యంత ఆందోళన కలిగిస్తున్నాయి' అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మరణాలపై ఉన్నతస్థాయి విచారణ జరపాలని, ఇలాంటి దురదృష్టకర మరణాలు జరగకుండా నిరోధించాలని కోరారు. ప్రభుత్వం నిర్లక్ష్యంతో జరిగిన ఈ మరణాల కారణాలను తారుమారు చేసే ప్రయత్నం జరుగుతోందన్నారు. విద్యార్థిని జమున మృతదేహానికి అర్ధరాత్రి పోస్టుమార్టం చేయడమేగాక అంత్యక్రియలకు హాజరయ్యేందుకు వెళ్తున్న తమ పార్టీ నాయకులను అడ్డుకొని పోలీసులు అరెస్టు చేశారని తెలిపారు. వీరి మరణ ధృవీకరణ పత్రాలు, మందులను తారుమారు చేసే ప్రయత్నం చేస్తోందని పేర్కొన్నారు. ఇది చాలా దారుణమైన విషయమని పేర్కొన్నారు. ఇక్కడ ఏం జరగకపోతే ఢిల్లీ నుంచి ఒక వైద్య బృందం, కాకినాడ నుంచి మరో వైద్య బృందం ఎందుకు వెళ్లాయని ప్రశ్నించారు. ఢిల్లీ బృందం విచారణ జరుపుతున్నా ఆరోగ్య శాఖ నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి తెలియదా అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు దాపరికంతో వ్యవహరిస్తోందని ప్రశ్నించారు. ముగ్గురు బాలికల మరణాల్ని ధ్రువీకరించి కారణాలు వెల్లడించాలని, మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రజల ఒత్తిడితో జాహ్నవి కుటుంబానికి ప్రకటించిన రూ.5 లక్షలు ఇప్పటివరకు అందలేదన్నారు. ఇప్పటి వరకు ఈ గ్రామాలను ఉన్నతాధికారులు గానీ, ప్రజా ప్రతినిధులుగానీ సందర్శించలేదు. కనీసం ఓదార్పు చెప్పేవారు లేరు. గిరిజనుల పట్ల ఇంతటి అమానవీయంగా ప్రభుత్వం ఎందుకు వ్యవహరిస్తున్నదో వెల్లడించాలన్నారు.

# సుజాతనగర్ లో విమాన స్థల పరిశీలన చేసిన (ఏ ఏ ఐ ) అధికారులు



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సెప్టెంబర్ 07::(వార్తా ప్రభ ప్రతినిధి)** సుజాతనగర్,కొత్తగూడెంలో ప్రతిపాదిత ఎయిర్‌పోర్ట్ నిర్మాణ స్థలాలను ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏ ఏ ఐ ) అధికారుల బృందం పరిశీలించింది. తెలంగాణ ఏవియేషన్ డైరెక్టర్ వి.ఎన్. భరత్ రెడ్డి నేతృత్వంలో వచ్చిన ఈ బృందంలో మొత్తం ఆరుగురు నిపుణులు ఉన్నారు. వీరిలో నలుగురు ఆంధ్రప్రదేశ్లోని గన్నవరం నుంచి, ఇద్దరు హైదరాబాద్ నుంచి వచ్చారు అధికారులు సుజాతనగర్ మండల పరిధిలోని ఆరు వేర్వేరు ప్రదేశాలను క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలిస్తున్నారు.ఈ కార్యక్రమంలో ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురామిరెడ్డి, కొత్తగూడెం మేయర్ మూడ్ గణేష్, ఆర్డీవో మధు, తహసీల్దార్ కృష్ణప్రసాద్, సర్వేయర్ లక్ష్మణ్, సీపీఐ జిల్లా కార్యదర్శి సాబిర్ పాషా పాల్గొన్నారు, ఆర్డీవో మధు, తహసీల్దార్ కృష్ణప్రసాద్, సర్వేయర్ లక్ష్మణ్, విమానాశ్రయ ఏర్పాటుకు అవసరమైన రన్వే విస్తరణ, రవాణా సౌకర్యాలు, భూసేకరణ అంశాలపై అధికారుల బృందం స్థానిక ప్రజాప్రతినిధులతో. ఈ ప్రాజెక్ట్ వేగవంతం కావడం వల్ల కొత్తగూడెం పరిసర ప్రాంతాల రవాణా, పారిశ్రామిక రంగాలు వేగంగా అభివృద్ధి చెందుతాయని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రతిపక్షాలను అడ్డుకోవటం అప్రజాస్వామికం.

**ఉద్యమ నాయకులు చిర్రా రవీందర్ యాదవ్**




**శేరిలింగంపల్లి,సెప్టెంబర్ 7 (వార్తాప్రభ):**శాసనసభకు నల్లచొక్కాలతో హాజరైన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను పోలీసులు అడ్డుకోవడం అప్రజాస్వామికమని శేరిలింగంపల్లి ఉద్యమ నాయకులు చిర్రా రవీందర్ యాదవ్ విమర్శించారు. ప్రజా సమస్యలపై నిరసన తెలిపే ప్రతిపక్ష హక్కును ప్రభుత్వం అడ్డుకోవడం సరికాదన్నారు .పార్లమెంటుకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నల్ల టీషర్ట్‌తో వెళ్లవచ్చని,రాష్ట్ర శాసనసభకు బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు నల్లచొక్కాలతో వెళ్లకూడదా అని ప్రశ్నించారు.ఎన్నికల హామీల అమలులో విఫలమైన ప్రభుత్వం ప్రతిపక్ష నిరసనలను అడ్డుకోవడం ద్వారా ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు.బీఆర్ఎస్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి చీరను పోలీసులు లాగడం, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు గాయాలు కావడం బాధాకరమన్నారు.పోలీసుల తీరుపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ప్రజల ఆగ్రహాన్ని ప్రభుత్వం అడ్డుకోలేదని, ప్రజా సమస్యలపై ప్రతిపక్షాల నిరసనలను అణచివేయకుండా ఇచ్చిన హామీలను అమలు చేసి ప్రజలకు సమాధానం చెప్పాలని చిర్రా రవీందర్ యాదవ్ డిమాండ్ చేశారు.

# వంద రోజుల్లో తీర్చుతామన్న హామీలు... వెయ్యి రోజులైనా తీరక పాయే

**జవహర్ నగర్ మాజీ మేయర్ మేకల కావ్య.**



**జవహర్ నగర్ సెప్టెంబర్ 7 (వార్తా ప్రభ):** కాంగ్రెస్ ప్రభుత్వం వంద రోజుల్లోనే ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చుతామని చెప్పి అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు గడుస్తున్నా అమలు చేయడం లేదంటూ నిరసిస్తూ బిఆర్ఎస్ శ్రేణులు... మేడ్చల్ మల్కాజ్గిరి కలెక్టర్ మను చౌదరికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ మేరకు ప్రతి సోమవారం జరిగే ప్రజావాణి నీ పురస్కరించుకొని సోమవారం మాజీ మేయర్ మేకల కావ్య ఆధ్వర్యంలో బిఆర్ఎస్ శ్రేణుల సమక్షంలో కలెక్టర్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మేకల కావ్య మాట్లాడుతూ అర్హులైన నిరుద్యోగ యువతీ యువకులకు నిరుద్యోగ భృతి ఉద్యోగం జాబ్ క్యాలెండర్ అమలు చేయాలని పెండింగ్ ఫీజు బకాయిలు చెల్లించాలని అన్నారు. పట్టణాలలో పారిశుధ్య నిర్వహణ మురుగు కంపుతో నిండిపోయి ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారని దావాఖానాల్లో మందులు కరువయ్యా యని పేర్కొన్నారు. ప్రతి కుటుంబానికి ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారుల ఫోరం జిల్లా అధ్యక్షుడు జిట్టా శ్రీనివాసరెడ్డి, దమ్మైగూడ చైర్మన్ ప్రణీత్, మాజీ కార్పొరేటర్ సంగీత రాజశేఖర్, నాయకులు ప్రసాద్ గౌడ్, కూటికంటి వెంకటేష్ గౌడ్, అహ్మద్ పాషా పంతంగి సిద్దులు యాదవ్, మూల సోమయ్య గౌడ్, సాయి, లక్ష్మణ్, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు

# సంపాదకీయం

## డాటర్ స్ట్రోక్...పొలిటికల్ డిక్షనరీలో కొత్త పేజి !

రాజకీయాల్లో ఎపుడూ సన్ స్ట్రోక్ అన్న పదం అందరికీ తెలుసు. కొడుకుల వల్ల రాజ్యాలు కూలిపోయి రాజకీయాలు చేతుల్లోంచి జారిపోయి పాతాళానికి పవర్ పడిపోయిన నేపథ్యం ఉంది. భారత రాజకీయాలో దానికి సంబంధించి బోలెడు ఉదాహరణలు ఉన్నాయి. సన్ స్ట్రోక్ మీద దేశ రాజకీయాల్లో బోలెడు పేజీలు కూడా కేటాయించారు. అంతటి కథలు కనిపిస్తాయి. కుమార రత్నం మీద ప్రేమతో తమ ఉద్యోగాలకు ఉరి వేసుకుని ఉరి తీసుకున్న నాన్నలు అమ్మలు ఎంతో మంది కనిపిస్తారు. పుత్ర ప్రేమకు అచ్చమైన ఉదాహరణ మహా భారతంలో దృతరాష్ట్రుడు. ఆయన మితిమీరిన వాత్సల్యంతో దుర్యోధనుడిని గారాబు చేసిన వైనం చివరికి కురుక్షేత్ర సంగ్రామానికి దారి తీసింది. ఆనాడే కుమారుడిని అదిలించి బెదిరించి ఉంటే అంత పెద్ద యుద్ధమూ ఉండేది కాదు, రాజ్యమూ నిలిచేది, నూరుగురు కుమారులూ బతికేవారు. పుత్ర శోకమూ తప్పేది. కానీ దృతరాష్ట్రుడు ఆ పని చేయలేదు కాబట్టే అయిదు వేల ఏళ్ళు గడచినా దృతరాష్ట్ర ప్రేమ అన్న ముతక సామెత అలా కొనసాగుతూ వస్తోంది. ఈ దేశాన్ని ఏలిన ఉక్కు మహిళ శ్రీమతి ఇందిరాగాంధీ 1977 ఎన్నికల్లో దారుణమైన ఓటమికి చిన్న కుమారుడు సంజయ్ గాంధీ దూకుడు పోకడలు కారణం అంటారు. అప్పట్లో తల్లి చాటుగా ఉంటూ అధికారం చలాయించింది ఆయనే అని కూడా చెబుతారు. అలా ఇందిరాగాంధీ వంటి వారు సన్ స్ట్రోక్ కి గురి అయి మూడేళ్ల పాటు అధికార వియోగాన్ని భరించారు. ఇలా ఎన్నో రకాలుగా ఇబ్బందులు పడిన మీదట ఆమె 1980లో తిరిగి అధికారంలోకి రాగలిగారు. ఇది దేశంలో ఒక అతి ముఖ్యమైన సన్ స్ట్రోక్ కథగా చెప్పుకుంటారు. అంతే కాదు దేశంలో అనేక రాష్ట్రాలలో ముఖ్యమంత్రులుగా చేసిన వారు తమ కుమారులకు పెత్తనం ఇచ్చి చివరికి ఏమీ కాకుండా పోయిన కథలూ ఉన్నాయి. లాలూ ప్రసాద్ లాంటి ఆర్జేడీ అధినేతలకు కూడా సన్ స్ట్రోకులున్నాయి. పెద్ద కుమారుడు తండ్రితో విభేదించి వెళ్తే చిన్న కుమారుడుతో ఆర్జేడీ బండిని లాలూ నడిపిస్తున్నారు. ఇక తమిళ దిగ్గజం కరుణానిధికి కూడా సన్ స్ట్రోక్ బాగానే తగిలింది అని అంటారు. ఆయన పెద్ద కుమారుడు అళగిరి చిన్న కుమారుడు స్టాలిన్ కి మధ్య పోరులో 2016లో ఎన్నికల్లో ఓటమి ఎదురైంది అని చెబుతారు. కర్ణాటకలో దేవేగౌడ ఇద్దరు కుమారులతో జేడీఎస్ ని నడుపుతూ ఒడిదుడుకుల పాలు అవుతున్నారు. ఒక దశలో ప్రత్యర్థి వరగంలో పెద్ద కుమారుడు చేతులు కలిపే దాకా సీన్ వెళ్ళింది. తెలుగు నాట కూడా కుమార రత్నాల రాకతో తండ్రుల రాజకీయ ప్రభ మసకబారిన ఉదంతాలు పంచాయతీ వార్డు నుంచి పార్లమెంట్ దాకా కనిపిస్తాయి. అయితే కుమారులు వారసులుగా ఆది నుంచి చెప్పుకుంటూ గర్వంగా నిలబడుతూ తండ్రుల తల్లుల రాజకీయ అడుగులకు అడ్డు పడడం అంతా చూశారు. కానీ కూతుళ్లు మాత్రం మెత్తగా ఉంటూ బుద్ధిగా మసలుకుంటూ కన్న వారి క్షేమమే చూస్తారు అని అనుకుంటూ ఉంటారు. అది కాదు అన్నట్లుగా మాజీ మంత్రి కొండా సురేఖ కుమార్తె సుస్మితా పటేల్ నిరూపించింది అని అంటున్నారు.

## సెప్టెంబర్ 11 నుంచి 24 వరకు జిల్లావ్యాప్తంగా ఇంటింటి కుష్ఠు వ్యాధి గుర్తింపు సర్వే

**తొలిదశలోనే కుష్ఠు వ్యాధిని గుర్తించి చికిత్స అందిస్తే అంగవైకల్యాన్ని నివారించవచ్చు .... జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ**

**విజయవాడ:** సెప్టెంబర్ 07::(వార్తా ప్రభ ప్రతినిధి)జిల్లాలో సెప్టెంబర్ 11వ తేదీ నుంచి 24వ తేదీ వరకు నిర్వహించనున్న ఇంటింటి కుష్ఠు వ్యాధి గుర్తింపు సర్వేకు సంబంధించిన గోడ పత్రికను జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ సోమవారం కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ మాట్లాడుతూ, “అంగవైకల్యాన్ని నివారించడానికి ముందుగానే కుష్ఠు వ్యాధిని గుర్తించి చికిత్స అందిస్తాము” అనే లక్ష్యంతో జిల్లావ్యాప్తంగా రెండు వారాల పాటు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కుష్ఠు వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించి, సకాలంలో చికిత్స అందించడం ద్వారా వ్యాధి తీవ్రతను తగ్గించడంతో పాటు అంగవైకల్యాన్ని నివారించవచ్చని పేర్కొన్నారు. ప్రజలు ఈ సర్వేకు పూర్తి సహకారం అందించాలని, ఆరోగ్య సిబ్బంది తమ ఇళ్లకు వచ్చినప్పుడు కుటుంబ సభ్యుల ఆరోగ్య వివరాలను తెలియజేసి పరీక్షలకు సహకరించాలని జిల్లా కలెక్టర్ కోరారు. శరీరంపై స్పర్శ తెలియని లేదా స్పర్శ తగ్గిన అనుమానాస్పద మచ్చలు కనిపించినట్లయితే వాటిని నిర్లక్ష్యం చేయకుండా సర్వే బృందానికి తెలియజేసి పరీక్షలు చేయించుకోవాలని కలెక్టర్ సూచించారు. కుష్ఠు వ్యాధికి సంబంధించిన లక్షణాలను ప్రారంభ దశలోనే గుర్తించడం ద్వారా వ్యాధి ఇతరులకు వ్యాప్తి చెందకుండా నియంత్రించడంతో పాటు, బాధితులకు సకాలంలో చికిత్స అందించే అవకాశం ఉంటుందని తెలిపారు. సర్వేలో భాగంగా ఆశా కార్యకర్తలు, ఎంపిక చేసిన పురుష ఆరోగ్య కార్యకర్తలు బృందాలుగా ఏర్పడి జిల్లాలోని ప్రతి ఇంటినీ సందర్శించనున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రతి కుటుంబంలోని సభ్యులను ఆరోగ్య సిబ్బంది పరిశీలించి, కుష్ఠు వ్యాధికి సంబంధించిన అనుమానాస్పద లక్షణాలు ఉన్న వ్యక్తులను గుర్తిస్తారని చెప్పారు. ప్రజలు ఎటువంటి భయాందోళనలకు గురికాకుండా ఆరోగ్య సిబ్బందికి సహకరించాలని కోరారు. ఇంటింటి సర్వేలో భాగంగా అనుమానిత కేసులను గుర్తించిన అనంతరం, సంబంధిత ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య బృందం ద్వారా మరోసారి వైద్య పరీక్షలు నిర్వహిస్తారని జిల్లా కలెక్టర్ వివరించారు. వైద్య పరీక్షల్లో కుష్ఠు వ్యాధి నిర్ధారణ అయిన వారికి వెంటనే మల్టీ డ్రగ్ థెరపీ -- బహుళ ఔషధ చికిత్స అందించనున్నట్లు తెలిపారు. చికిత్సను క్రమం తప్పకుండా తీసుకోవడం ద్వారా వ్యాధిని పూర్తిగా నియంత్రించవచ్చని పేర్కొన్నారు. కుష్ఠు వ్యాధికి సంబంధించిన పరీక్షలు, చికిత్సను ప్రభుత్వం పూర్తిగా ఉచితంగా అందిస్తోందని జిల్లా కలెక్టర్ తెలిపారు. వ్యాధి నిర్ధారణ అయిన వ్యక్తులు చికిత్స విషయంలో ఎటువంటి నిర్లక్ష్యం చేయకుండా వైద్యుల సూచనల మేరకు మందులు వినియోగించాలని సూచించారు. కుష్ఠు వ్యాధి పట్ల ప్రజల్లో ఉన్న అపోహలు, భయాలను తొలగించి, వ్యాధి లక్షణాలు ఉన్నవారు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి పరీక్షలు చేయించుకునేలా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలో నిర్వహించనున్న ఇంటింటి కుష్ఠు వ్యాధి గుర్తింపు సర్వేను విజయవంతం చేయడానికి అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఆరోగ్య సిబ్బంది తమ ఇళ్లకు వచ్చినప్పుడు కుటుంబ సభ్యులందరూ పరీక్షలకు సహకరించి, అనుమానాస్పద లక్షణాలు ఉంటే ఎటువంటి సంకోచం లేకుండా తెలియజేయాలని సూచించారు. తొలిదశలో వ్యాధిని గుర్తించడం -- సకాలంలో చికిత్స అందించడం -- అంగవైకల్యాన్ని నివారించడం అనే లక్ష్యంతో జిల్లా యంత్రాంగం, వైద్య ఆరోగ్య శాఖ సమన్వయంతో ఈ సర్వేను సమర్థవంతంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, డిఆర్ఓ ఎం.లక్ష్మీనరసింహం, జిల్లా లెప్రసీ, టీబీ, ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ బి.భాను నాయక్, డీఈఓ ఎల్.చంద్రకళ, పలువురు జిల్లా అధికారులు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# విజయవాడ నగరంలో ఘనంగా స్వచ్ఛ వాయు దివస్ నిర్వహణ






**విజయవాడ పశ్చిమ సెప్టెంబర్ 7 :(వార్త ప్రభ ప్రతినిధి)** విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలోని మూడు సర్కిళ్లలో స్వచ్ఛ వాయు దివస్‌ను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా వన్‌టౌన్‌లోని గాంధీజీ మున్సిపల్ స్కూల్, న్యూ రాజరాజేశ్వరిపేటలోని దేవినేని వెంకటరమణ హైస్కూల్, కృష్ణలంకలోని వీఎంఆర్ స్కూల్‌లలో విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణ, వాయు కాలుష్య నియంత్రణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్స్) డా. డి. చంద్రశేఖర్ మాట్లాడుతూ, నగరంలో వాయు కాలుష్యాన్ని తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా పర్యావరణహిత చర్యలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి, దానిని సంరక్షించే బాధ్యతను తీసుకోవాలని సూచించారు. విజయవాడ నగరపాలక సంస్థ పర్యావరణ పరిరక్షణ, వాయు కాలుష్య నియంత్రణకు చేపడుతున్న చర్యలకు జాతీయ, రాష్ట్ర స్థాయిలో గుర్తింపు లభించడం ఎంతో గర్వకారణమని తెలిపారు. స్వచ్ఛ వాయు సర్వేక్షణ్--2026లో విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలోని 60వ వార్డు జాతీయ స్థాయిలో బెస్ట్ పెర్ఫార్మింగ్ వార్డుగా ద్వితీయ ర్యాంక్ సాధించిందని, అలాగే 31వ వార్డు రాష్ట్ర స్థాయిలో బెస్ట్ పెర్ఫార్మింగ్ వార్డుగా అవార్డు సాధించిందని, విజయవాడ నగరానికి, నగరపాలక సంస్థకు గర్వకారణమని పేర్కొన్నారు. ఈ అవార్డులు కేవలం ఒక సంస్థకు లభించిన గుర్తింపు మాత్రమే కాదని, విజయవాడ నగరాన్ని పరిశుభ్రంగా, పచ్చగా, కాలుష్యరహితంగా తీర్చిదిద్దేందుకు అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, ప్రజలు కలిసి చేస్తున్న సమష్టి కృషికి లభించిన గౌరవమని అన్నారు. పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, వాతావరణ మార్పుల నేపథ్యంలో కాలుష్య నియంత్రణకు సమష్టి చర్యలు అవసరమని తెలిపారు. ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని పెంచడం, కాలుష్యాన్ని అధికంగా వెదజల్లే వాహనాల వినియోగాన్ని తగ్గించడం, ప్రజా రవాణాను ఎక్కువగా వినియోగించడం, పచ్చదనాన్ని పెంపొందించడం వంటి చర్యల ద్వారా పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. నేటి విద్యార్థులే రేపటి బాధ్యతాయుతమైన పౌరులని పేర్కొన్న ఆయన, విద్యార్థులు తమ నగరాన్ని పరిశుభ్రంగా, పచ్చగా, కాలుష్యరహితంగా ఉంచేందుకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయాలని సూచించారు. భావితరాలకు స్వచ్ఛమైన గాలి, పరిశుభ్రమైన పర్యావరణం, సహజ వనరులను అందించాలంటే ఇప్పటి నుంచే పర్యావరణహిత జీవన విధానాలను అలవర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఎలక్ట్రిక్ బైకులు మరియు సైకిళ్ళతో ర్యాలీ నిర్వహించి ప్రజలకు పర్యావరణ పరిరక్షణ పై అవగాహన కల్పించారు. విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలోని మూడు సర్కిళ్ల కార్యాలయాల్లోనూ జోనల్ కమిషనర్ల ఆధ్వర్యంలో స్వచ్ఛ వాయు దివస్ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వాయు కాలుష్యానికి కారణాలు, దాని ప్రభావాలు, కాలుష్య నియంత్రణ చర్యలు, పర్యావరణ పరిరక్షణ, మొక్కల పెంపకం తదితర అంశాలపై విస్తృత అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాల్లో జోనల్ కమిషనర్లు కే. ప్రభుదాస్, కె. షమ్మీ, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ (ఇన్‌చార్జ్) డా. గోపాల నాయక్, డిప్యూటీ డైరెక్టర్ (హార్టికల్చర్) చంద్రశేఖర్, సంబంధిత అధికారులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు

# ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యం

**మున్సిపల్ చైర్మన్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు ఇబ్రహీంపట్నం లో ఏసీ బస్‌స్టాప్ శంకుస్థాపన**



**ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 07(వార్తా ప్రభ ప్రతినిధి):** మున్సిపాలిటీ పరిధిలో ప్రజలకు మౌలిక వసతులు, మెరుగైన ప్రయాణ సౌకర్యాలు అందించడమే లక్ష్యంగా పాలకమండలి పనిచేస్తుందని తెలిపారు మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు. ఇబ్రాహీంపట్నం రింగ్ సెంటర్‌లోని హైదరాబాద్ బస్‌స్టాప్ వద్ద ప్రయాణికుల సౌకర్యార్థం ఏసీ బస్‌స్టాప్‌తో పాటు పబ్లిక్ టాయిలెట్స్ ఏర్పాటు చేసేందుకు సోమవారం శంకుస్థాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొండపల్లి మున్సిపాలిటీ చైర్మన్, ఎన్టీఆర్ జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి చెన్నుబోయిన చిట్టిబాబు ముఖ్య అతిథిగా పాల్గొని శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలో ప్రజల అవసరాలను గుర్తించి, వారికి ఉపయోగపడే మౌలిక వసతులను అందుబాటులోకి తీసుకురావడమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ముఖ్యంగా ఇబ్రాహీంపట్నం రింగ్ సెంటర్ వంటి రద్దీ ప్రాంతంలో ప్రతిరోజూ పెద్ద సంఖ్యలో ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారని, వారి సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఏసీ బస్‌స్టాప్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. బస్‌స్టాప్‌కు సమీపంలో పబ్లిక్ టాయిలెట్స్‌ను పే అండ్ యూజ్ విధానంలో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. టాయిలెట్స్‌ను నిర్వహించే వ్యక్తి లేదా సంస్థే వాటి నిర్వహణతో పాటు ఏసీ బస్‌స్టాప్ నిర్వహణ బాధ్యతలను కూడా చేపట్టే విధంగా వ్యవస్థను ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి జంపాల సీతారామయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ చుట్టుకుదురు శ్రీనివాసరావు, మున్సిపల్ పార్టీ అధ్యక్షులు బాలాజీ, కమిషనర్ శ్రీనివాసరావు, ఇబ్రాహీంపట్నం క్లస్టర్ ఇన్‌చార్జి చనుమోలు నారాయణరావు, కౌన్సిలర్లు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

# యూట్యూబర్ రామానందనకు పోలీసుల నోటీసు

**రెండు రోజుల్లో ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ లో హాజరు కావాలని ఆదేశం**

**- యూకేలో ఉద్యోగాలిప్పిస్తామని నిరుద్యోగులను మోసం చేసిన నందూస్ వరల్డ్ దంపతులు**




**ఇబ్రహీంపట్నం (ఎన్టీఆర్), (వార్తా ప్రభ ప్రతినిధి):** యూకేలో ఉద్యోగాలిప్పిస్తామని రూ.కోట్లు వసూలు చేసి నిరుద్యోగులకు కుచ్చు టోపీ పెట్టిన కేసులో నిందితురాలైన ప్రముఖ యూట్యూబర్ (నందూస్ వరల్డ్), మన శంకర వరప్రసాద్ చిత్రం నటి రామానందన అలియాస్ నందుకు ఇబ్రహీంపట్నం పోలీసులు సోమవారం 41 నోటీసు ఇచ్చారు. లండన్ నుంచి ఆమె విమానంలో స్వదేశానికి రావడంతో హైదరాబాద్ విమానాశ్రయంలో పోలీసులు నోటీసులు జారీ చేశారు. విదేశాల్లో లక్షల్లో జీతాలు వచ్చే ఉద్యోగాలిప్పిస్తామని నమ్మబలికిన డెస్టినీ కన్సల్టెన్సీ బాధితుల నుంచి పెద్ద ఎత్తున నగదు డిపాజిట్ చేయించుకుని బోర్డు తిప్పేసింది. దీనిపై పశ్చిమ ఇబ్రహీంపట్నానికి చెందిన బాధితుడు ఎం.శివక్రాంతి గత ఏడాది నవంబర్ లో ఇబ్రహీంపట్నం పోలీసులకు ఫిర్యాదు చేయగా నిందితులు జాగర్లమూడి మధుకర్, రామానందన అలియాస్ నందు, మధుకర్ తండ్రి మోహన రావులపై కేసు నమోదు చేశారు. లండన్ లో ఉన్న నిందితులు మధుకర్, నందు భారత్ కు వస్తే ఎయిర్ పోర్ట్ లో నిలిపివేసి అరెస్టు చేసే విధంగా ఇబ్రహీంపట్నం పోలీసులు ఈ ఏడాది జూన్ 5న లుకౌట్ నోటీసులు కూడా జారీ చేశారు. అయితే రామనందన స్వదేశానికి వస్తున్న విషయం తెలుసుకున్న ఎయిర్ పోర్ట్ అధారిటీ అధికారులు ఎమ్మిగ్రేషన్ చేసి ఇబ్రహీంపట్నం పోలీసులకు సమాచారం అందించారు. నిందితురాలు రామానందన తరపున ఇద్దరు న్యాయవాదులు ఉండటంతో అరెస్టుకు వెళ్లిన పోలీసులు 41 నోటీసు అందించారు. రెండు రోజుల్లో ఆమె ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ లో హాజరు కావాల్సి ఉందని సీఐ ఎ.సుబ్రహ్మణ్యం ఆంధ్రప్రభకు తెలిపారు.

# కంటెంట్ క్రియేషన్ స్టూడియో, ల్యాబ్‌లను సద్వినియోగం చేసుకోవాలి

**యువత సృజనాత్మకతకు కంటెంట్ క్రియేషన్ స్టూడియో వేదిక**

**‘లోకల్ టాలెంట్ - లోకల్ ఇన్‌కమ్’కు ప్రోత్సాహం**

**పర్యాటక, సాంస్కృతిక వైభవానికి డిజిటల్ ప్రచారం**



**విజయవాడ:** సెప్టెంబర్ 07::(వార్తా ప్రభ ప్రతినిధి)ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంటెంట్ క్రియేషన్ స్టూడియో, ల్యాబ్‌లను యువత, మహిళలు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. ‘ఆరెంజ్ ఎకానమీ’లో భాగంగా సృజనాత్మకత, డిజిటల్ మీడియా, పర్యాటకం, సంస్కృతి, ఉపాధిని అనుసంధానం చేస్తూ యువతకు కొత్త అవకాశాలు కల్పించడమే లక్ష్యమన్నారు. కంటెంట్ ల్యాబ్‌లో వీడియో రికార్డింగ్, ఎడిటింగ్, లైవ్ స్ట్రీమింగ్ వంటి ప్రొఫెషనల్ సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కంటెంట్ తయారీ, వీడియో చిత్రీకరణ, ఎడిటింగ్, కథనం, బాధ్యతాయుతమైన సోషల్ మీడియా వినియోగంపై శిక్షణ అందిస్తామన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలు, విద్యార్థులు, గ్రామీణ యువతలోని ప్రతిభను గుర్తించి ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలుగా మలచేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఎన్‌టీఆర్ జిల్లాలోని పర్యాటక ప్రదేశాలు, దేవాలయాలు, చారిత్రక ప్రదేశాలు, పండుగలు, స్థానిక వంటకాలు, జానపద కళలు, సంస్కృతి, సంప్రదాయాలను డిజిటల్ వేదికల ద్వారా ప్రపంచానికి పరిచయం చేసేలా నాణ్యమైన కంటెంట్ రూపొందించాలని కలెక్టర్ సూచించారు. తద్వారా ‘లోకల్ టాలెంట్ -- లోకల్ ఇన్‌కమ్’తో పాటు జిల్లాకు విస్తృత పర్యాటక, సాంస్కృతిక ప్రచారం లభిస్తుందన్నారు. కంటెంట్ స్టూడియో, ల్యాబ్ వినియోగం, శిక్షణకు సంబంధించిన వివరాల కోసం కంటెంట్ ల్యాబ్ నిర్వాహకులు బివి రామకృష్ణ -- 9885202025ను సంప్రదించాలని జిల్లా కలెక్టర్ సూచించారు.

# పల్లా దుర్గాంభ ని పరామర్శించిన సీపీఐ జాతీయ కార్యదర్శి కే రామకృష్ణ



**విజయవాడ పశ్చిమ సెప్టెంబర్ 7 :(వార్త ప్రభ ప్రతినిధి)** సిపిఐ విజయవాడ నగర మాజీ కార్యదర్శి, దివంగత నేత పల్లా సూర్యరావు సతీమణి, మాజీ కార్పొరేటర్, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య నగర సీనియర్ నాయకురాలు పల్లా దుర్గాంబను సిపిఐ జాతీయ కార్యదర్శి కె రామకృష్ణ, విజయవాడ నగర కార్యదర్శి జి కోటేశ్వరరావులు పరామర్శించారు. ఇటీవల నగర సిపిఐ సీనియర్ నాయకులు పల్లా సూర్యారావు మరణించిన నేపథ్యంలో రామకృష్ణ, కోటేశ్వరావులు పల్లా సూర్యారావు ఇంటికి వెళ్లి ఆయన సతీమణి దుర్గంబను పరామర్శించి, కమ్యూనిస్టు ఉద్యమంలో పల్లా సూర్యారావు పోరాట పటిమను, ఆయన అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు. దుర్గాంబ కుటుంబ సభ్యులకు పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. స్థానిక డివిజన్ పార్టీ కార్యదర్శి ఆకుల యేసు సహాయ కార్యదర్శి శ్రీనివాసరావులు పాల్గొన్నారు.

# ప్రతి ఫిర్యాదుకు శాశ్వత పరిష్కారం అందించాలి




**విజయవాడ పశ్చిమ సెప్టెంబర్ 7 :(వార్త ప్రభ ప్రతినిధి)**విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్స్) డా. డి. చంద్రశేఖర్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి అందే ప్రతి ఫిర్యాదును అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, నిర్ణీత గడువులోగా శాశ్వత పరిష్కారం చూపాలని అదనపు కమిషనర్ అన్నారు. సంబంధిత శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి, ఫిర్యాదుదారులకు సమస్య పరిష్కార వివరాలను తెలియజేయాలని సూచించారు. ఈ వారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల వేదికలో మొత్తం 13 ఫిర్యాదులు అందాయి. పట్టణ ప్రణాళిక శాఖకు 8, ఇంజనీరింగ్ శాఖకు 2, పబ్లిక్ హెల్త్, రెవెన్యూ, ఎస్టేట్ శాఖలకు ఒక్కొక్క ఫిర్యాదు చొప్పున అందినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో చీఫ్ ఇంజనీర్ సత్యకుమారి, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ (ఇన్‌చార్జి) డాక్టర్ గోపాల్ కృష్ణ నాయక్, పర్యవేక్షణ ఇంజనీరు కె. దుష్యంత్, డిప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ చంద్రశేఖర్, డిప్యూటీ సిటీ ప్లానర్ చంద్రబోస్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ డి. హరీష్, బయాలజిస్ట్ సూర్యకుమార్ నాయక్, రీజినల్ ఫైర్ ఆఫీసర్ సిహెచ్. రత్నబాబు, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# అక్షరాస్యతతోనే సమాజ ప్రగతి - ప్రతి ఒక్కరికీ విద్య అందాలి

**అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవం సందర్భంగా గోడ పత్రికను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ**



**విజయవాడ:** సెప్టెంబర్ 07::(వార్తా ప్రభ ప్రతినిధి) సెప్టెంబరు 8న నిర్వహించనున్న అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవం సందర్భంగా వయోజన విద్యాశాఖ రూపొందించిన గోడ పత్రికను సోమవారం విజయవాడ కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ మాట్లాడుతూ అక్షరాస్యత అనేది వ్యక్తిగత అభివృద్ధికి మాత్రమే కాకుండా కుటుంబ, సామాజిక, ఆర్థిక అభివృద్ధికి కూడా కీలకమని తెలిపారు. చదవడం, రాయడంతో పాటు నిత్య జీవితానికి అవసరమైన ప్రాథమిక జ్ఞానం, అవగాహన ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వయోజనుల్లో అక్షరాస్యతను పెంపొందించడం ద్వారా వారు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవడంతో పాటు తమ హక్కులు, బాధ్యతలపై అవగాహన పెంపొందించుకోగలరని తెలిపారు. అక్షరాస్యతను సామాజిక ఉద్యమంగా తీసుకెళ్లేందుకు అన్ని వర్గాల భాగస్వామ్యం అవసరమన్నారు. అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవాన్ని పురస్కరించుకుని సెప్టెంబరు 8, మంగళవారం ఉదయం 10 గంటలకు విజయవాడ కేబీఎన్ కాలేజీ ఆడిటోరియంలో వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. అక్షరాస్యత ప్రాధాన్యతపై అవగాహన కల్పించడంతో పాటు వయోజన విద్యా కార్యక్రమాలపై ప్రజలకు వివరించేలా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. గోడ పత్రిక ఆవిష్కరణ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియ, డిఆర్ఓ ఎం. లక్ష్మీనరసింహం, వయోజన విద్యాశాఖ అధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## సామాజిక వర్గాల వారీగా ఓటర్ల తుది జాబితాల ప్రదర్శన..



**గుడ్లవల్లేరు:సెప్టెంబర్ 07::(వార్తా ప్రభ ప్రతినిధి)** మండల కేంద్రం లోని మండల పరిషత్ కార్యాలయంలోని నోటీస్ బోర్డులో బీసీ, ఎస్టీ, ఎస్సీ వంటి సామాజిక వర్గాల వారీగా ఓటర్ల తుది జాబితాను సోమవారం ఎంపీడీఓ ఎండీ ఇమ్రాన్ ప్రదర్శించారు. గ్రామ సభల ద్వారా ఆయా గ్రామాల్లోని ఓటర్ల జాబితాలను పరిశీలించి, ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన ఓటర్ల వివరాలను క్షేత్రస్థాయిలో నిర్ధారించి తుది పబ్లికేషన్ చేసినట్లు పేర్కొన్నారు. ఓటర్ల జాబితాలో అర్హులైన ప్రతి ఒక్కరి వివరాలు సక్రమంగా నమోదు అయ్యేలా, ఎటువంటి అర్హత కలిగిన ఓటరు వివరాలు తప్పిపోకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలరని ఎంపీడీఓ ఇమ్రాన్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డెప్యూటీ ఎంపీడీఓ జి.ఎస్.ఎస్.అంజనాదేవి, జూనియర్ అసిస్టెంట్ పోలుకొండ బలరామ్ తదితరులు పాల్గొన్నారు.

# యాదవుల ఐక్యతే బలం.. హక్కుల సాధనే లక్ష్యం

**- చిత్తూరు జిల్లా అఖిల భారత యాదవ మహా సంఘం కార్యవర్గ సమావేశంలో కీలక తీర్మానాలు**

**తిరుపతి: సెప్టెంబర్ 07::(వార్తా ప్రభ ప్రతినిధి)**యాదవుల సామాజిక, ఆర్థిక, రాజకీయ అభివృద్ధి కోసం సంఘాన్ని గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు మరింత బలోపేతం చేయాలని చిత్తూరు జిల్లా అఖిల భారత యాదవ మహా సంఘం నాయకులు పిలుపునిచ్చారు. జిల్లా అధ్యక్షులు పి. నవీన్ యాదవ్ అధ్యక్షతన నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశం ఘనంగా జరిగింది. జిల్లాలోని 31 మండలాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులతో పాటు మహిళా విభాగం జిల్లా కార్యవర్గ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.సమావేశానికి అఖిల భారత యాదవ మహా సంఘం జాతీయ అధ్యక్షులు బుసగాని లక్ష్మయ్య యాదవ్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గంగాదేవి గంగయ్య యాదవ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరువాటి వెంకట ముని యాదవ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబుల రెడ్డి యాదవ్, రాష్ట్ర అధికార ప్రతినిధి ఆవుల గోపి యాదవ్, రాయలసీమ జోన్ మహిళా అధ్యక్షురాలు గాయత్రి యాదవ్, రాష్ట్ర ప్రచార కార్యదర్శి చాట మునిరాజా యాదవ్, తిరుపతి టౌన్ అధ్యక్షులు గాలం వెంకటేష్ యాదవ్ తదితరులు హాజరయ్యారు.ఈ సందర్భంగా సంఘాన్ని గ్రామస్థాయి వరకు విస్తరించడం, యాదవుల ఐక్యతను



పెంపొందించడం, హక్కులు, రాజకీయ ప్రాతినిధ్యం, సామాజిక అభివృద్ధి తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. అనంతరం పలు కీలక తీర్మానాలను ఆమోదించారు.కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం బ్రహ్మోత్సవాల్లో యాదవులకు ఒకరోజు ఉభయం కేటాయించాలని దేవస్థానం అధికారులను కోరుతూ తీర్మానించారు. చిత్తూరు గోపాలపురంలోని యాదవ కల్చరల్ అండ్ వెల్ఫేర్ ట్రస్ట్‌లో జిల్లా యాదవ సంఘ సభ్యులకు సభ్యత్వం కల్పించి, సుమారు 12 వేల చదరపు అడుగుల స్థలంలో యాదవ భవన్, యాదవ కల్యాణ మండపం నిర్మాణానికి చర్యలు చేపట్టాలని నిర్ణయించారు.రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీల నుంచి యాదవులకు అధిక సంఖ్యలో టికెట్లు లభించేలా కృషి చేసి, అభ్యర్థుల విజయానికి సంఘం సహకారం అందించాలని తీర్మానించారు. జిల్లాలో ఎక్కడైనా యాదవులపై దాడులు జరిగితే బాధితులకు సంఘం అండగా నిలిచి న్యాయం కోసం పోరాడాలని నిర్ణయించారు. బీసీల రక్షణకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని ప్రభుత్వాన్ని కోరుతూ మరో తీర్మానం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షులు కోదండ యాదవ్, ఉపాధ్యక్షులు ఎం. కోదండ యాదవ్, జనార్దన్ యాదవ్, వాసు యాదవ్, లక్ష్మీపతి యాదవ్, ప్రధాన కార్యదర్శి కుమార్ యాదవ్, మహిళా విభాగం అధ్యక్షురాలు రాణి యాదవ్, ప్రధాన కార్యదర్శి ప్రతిభ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## రేణిగుంటకు యోగి ఆదిత్యనాథ్.. ఘన స్వాగతం

***మంత్రి సత్యకుమార్ యాదవ్‌తో మర్యాదపూర్వక భేటీ***



**తిరుపతి, సెప్టెంబర్ 07::(వార్తా ప్రభ ప్రతినిధి)** తిరుపతి, నెల్లూరు జిల్లాల్లో ఒకరోజు పర్యటన నిమిత్తం ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సోమవారం ఉదయం రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆయనకు ఘన స్వాగతం పలికారు.అనంతరం మంత్రి సత్యకుమార్ యాదవ్.. యోగి ఆదిత్యనాథ్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకుని ఆత్మీయంగా పలకరించారు. ఈ సందర్భంగా ఎస్వీ వైద్య కళాశాల పీఆర్వో వీర కిరణ్‌ను ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రికి పరిచయం చేశారు. వీర కిరణ్ కూడా యోగి ఆదిత్యనాథ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి అభివాదం చేశారు.యోగి ఆదిత్యనాథ్ రాక సందర్భంగా రేణిగుంట విమానాశ్రయంలో అధికారులు భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. ఆయన పర్యటనకు రాజకీయ, ఆధ్యాత్మిక ప్రాధాన్యత ఉండటంతో విమానాశ్రయ పరిసరాల్లో సందడి నెలకొంది. పర్యటనలో భాగంగా తిరుపతి, నెల్లూరు జిల్లాల్లో పలు కార్యక్రమాల్లో యోగి ఆదిత్యనాథ్ పాల్గొననున్నారు.

## మహిళా రోగులకు ఈసీజీ, ఎకో పరీక్షల్లో ఇబ్బందులు?

**అత్యవసర వేళల్లో మహిళా టెక్నీషియన్లు లేని లోటు??**
**గుండె పరీక్షల కోసం వచ్చిన మహిళా రోగులకు తప్పని నిరీక్షణ!**

**మచిలీపట్నం సెప్టెంబర్ 07::(వార్తా ప్రభ ప్రతినిధి)**మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రిలో గుండె సంబంధిత పరీక్షలు నిర్వహించే టెక్నీషియన్ల వ్యవహారం మరోసారి చర్చనీయాంశంగా మారింది. మహిళా రోగులకు ఈసీజీ, 2డీ ఎకో వంటి పరీక్షలు నిర్వహించే సమయంలో మహిళా సిబ్బంది అందుబాటులో ఉండటం లేదంటూ పలువురు మహిళలు ఆరోపిస్తున్నారు.గతంలో మహిళా రోగులకు పురుష టెక్నీషియన్లతోనే పరీక్షలు నిర్వహిస్తున్నారంటూ ఆరోపణలు రావడంతో కొంతకాలం మహిళా టెక్నీషియన్లను అందుబాటులోకి తీసుకువచ్చారని, అయితే ప్రస్తుతం మళ్లీ పాత పరిస్థితులే నెలకొన్నాయని కొంతమంది మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.గుండె సంబంధిత సమస్యలతో ఆసుపత్రికి వచ్చే రోగులకు ఈసీజీ, 2డీ ఎకో పరీక్షలు ఆలస్యం కాకుండా నిర్వహించడం కీలకం. అయితే అత్యవసర సమయంలో మహిళా టెక్నీషియన్లు అందుబాటులో లేకపోవడంతో పురుష టెక్నీషియన్లతోనే పరీక్షలు చేయించుకోవాల్సి వస్తోందని కొంతమంది మహిళా రోగులు ఆరోపిస్తున్నారు.ఆసుపత్రి సిబ్బంది మహిళా సిబ్బంది అందుబాటులో లేరని, "నాలుగు రోజులు ఆగండి.. మహిళా సిబ్బంది వస్తారు" అంటూ సమాధానం ఇస్తున్నారని వారు చెబుతున్నారు. అత్యవసర వైద్య పరీక్షలకు వచ్చిన రోగులను రోజుల తరబడి వేచి ఉండమని చెప్పడంతో కొంతమంది రోగులు ఇంటి ముఖం పడుతున్నారు.

**గోప్యత, గౌరవం విషయంలో ఆసుపత్రి బాధ్యత ఏంటి?** మహిళా రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించే సమయంలో వారి వ్యక్తిగత గోప్యత, గౌరవం, సౌకర్యం కూడా ముఖ్యమేనని మహిళా రోగుల బంధువులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా అత్యవసర పరిస్థితుల్లో మహిళా సిబ్బంది అందుబాటులో లేకపోవడం వల్ల ఇబ్బందులు




ఎదురవుతున్నాయని వారు అంటున్నారు.అత్యవసర వైద్య సేవలను ఆలస్యం చేయకుండా అందిస్తూనే, మహిళా రోగుల సౌకర్యం కోసం తగిన సంఖ్యలో మహిళా టెక్నీషియన్లను షిఫ్ట్‌ల వారీగా అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.ప్రభుత్వాసుపత్రికి వచ్చే పేద, మధ్యతరగతి ప్రజలకు అత్యవసర వైద్యం అందించాల్సిన బాధ్యత ఆసుపత్రి యంత్రాంగంపై ఉంది. గుండె సంబంధిత పరీక్షల కోసం వచ్చిన మహిళా రోగులకు సిబ్బంది కొరత కారణంగా నిరీక్షణ తప్పనిసరి అయితే, దీనిపై ఆసుపత్రి ఉన్నతాధికారులు వెంటనే దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.మహిళా రోగులకు అవసరమైన సమయంలో మహిళా టెక్నీషియన్లు అందుబాటులో ఉండేలా శాశ్వత పరిష్కారం చూపాలని, ఈసీజీ, 2డీ ఎకో వంటి పరీక్షల్లో జాప్యం లేకుండా వైద్య సేవలు అందించాలని ప్రజలు కోరుతున్నారు.జిల్లా కలెక్టర్, ఆసుపత్రి ఉన్నతాధికారులు ఈ అంశంపై దృష్టి సారించి సిబ్బంది షిఫ్ట్‌లు, అందుబాటులో ఉన్న మహిళా టెక్నీషియన్ల వివరాలు, అత్యవసర పరీక్షల నిర్వహణ విధానంపై సమీక్ష చేయాలని మహిళా రోగులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## ప్రజా సేవకుడు బొమ్మిన కోటేశ్వరరావు జన్మదిన వేడుకల్లో ప్రజలకు వెలుగు

**యంఎన్ఆర్ ఫౌండేషన్ - శంకర కంటి ఆసుపత్రి ఉచిత కంటి వైద్య శిబిరం!**



**రెడ్డిగూడెం సెప్టెంబర్ 07::(వార్తా ప్రభ ప్రతినిధి)**పుట్టినరోజు అంటే మన కోసం వేడుక చేసుకోవడం మాత్రమే కాదు ఆ రోజు మరొకరి జీవితంలో వెలుగు నింపితే, అదే అసలైన పుట్టినరోజు వేడుక అని బొమ్మిన నారాయణ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు రెడ్డిగూడెం మండల టీడీపీ యువనాయకులు బొమ్మిన కోటేశ్వరరావు మరో సారి నిరూపించారు.ప్రజా సేవకుడు బొమ్మిన కోటేశ్వరరావు జన్మదినాన్ని పురస్కరించుకుని, అన్నేరావుపేట గ్రామ సచివాలయం వద్ద వీబీ= ఫౌండేషన్ - శంకర కంటి ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు.ఈ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని బొమ్మిన కోటేశ్వరరావు , గ్రామ పెద్దలు బాబురావు, వేణు, వాసు బాబు, రమేష్, పుష్పావతి, శ్రీను, చంద్రరావు , వెంకటేశ్వరరావు, సుబ్బారెడ్డి, చందా, హబీబ్, రవి సోమేశ్వరరావు కలిసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కంటి సమస్యలతో బాధపడుతున్న ప్రజలకు వైద్య నిపుణులచే ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి తదుపరి వైద్య సేవలు అందించేలా ఏర్పాట్లు చేశారు.పేద, మధ్యతరగతి ప్రజలకు కంటి వైద్యం అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో వీబీ= ఫౌండేషన్ చేపడుతున్న సేవా కార్యక్రమాలకు శంకర కంటి ఆసుపత్రి వైద్య సేవలు తోడవడంతో అన్నేరావుపేటలో ఈ శిబిరం ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా నిలిచింది.బొమ్మిన కోటేశ్వరరావు జన్మదినం ఒక వ్యక్తి జీవితంలో మరో సంవత్సరం ప్రారంభమైన రోజు మాత్రమే కాదు...ఎంతోమంది జీవితాల్లో వెలుగు నింపిన సేవా దినంగా నిలిచింది. పుట్టినరోజు వేడుకలకు సేవను జోడించి ప్రజల కళ్లలో వెలుగును నింపిన ఈ కార్యక్రమం నిజమైన జన్మదిన వేడుకకు చిరునామాగా నిలిచింది.ఈ సందర్భంగా ముప్పిడి నాగేశ్వరరెడ్డి బొమ్మిన కోటేశ్వరరావుకి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ప్రజాసేవలో మరెన్నో మంచి కార్యక్రమాలకు ఈ జన్మదినం నాంది కావాలని కోరారు .

## 40ఏళ్ల చర్మకారులకు పింఛన్లు ఇవ్వాలి....



**గుడ్లవల్లేరు: సెప్టెంబర్ 07::(వార్తా ప్రభ ప్రతినిధి)**40ఏళ్లు నిండిన చర్మకారులు, 50ఏళ్ల డప్పు కళాకారులకు ప్రభుత్వ పింఛన్లను ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి బుల్లా త్యాగరాజు(కింగ్) కోరారు. ఈ విషయమై సోమవారం గుడ్లవల్లేరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ ఎండీ ఇమ్రాన్‌ను కలిసి వినతిపత్రాన్ని అందించారు.

## అర్హులందరికీ ఎన్టీఆర్ భరోసా పింఛన్లు

**వైసీపీ కుల రాజకీయాలకు తెరలేపుతోంది.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి**
**టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు గొల్ల నరసింహ యాదవ్**

**తిరుపతి, సెప్టెంబర్ 07::(వార్తా ప్రభ ప్రతినిధి)**ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు అర్హులైన ప్రతి ఒక్కరికీ ఎన్టీఆర్ భరోసా పింఛన్లు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు గొల్ల నరసింహ యాదవ్ అన్నారు. నూతన పింఛన్ల కోసం సెప్టెంబర్ 7 నుంచి 16వ తేదీ వరకు అర్హులు తమకు సమీపంలోని గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.సోమవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో నరసింహ యాదవ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో సుమారు 63 లక్షల మంది లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లను ప్రభుత్వం అందిస్తోందని తెలిపారు. ఇందుకోసం ప్రతి నెలా రూ.2,694 కోట్లను ప్రభుత్వం ఖర్చు చేస్తోందన్నారు. ప్రతి నెలా ఒకటో తేదీన లబ్ధిదారుల ఇళ్ల వద్దకే పింఛన్లు అందిస్తున్నామని, ఒకటో తేదీన ప్రభుత్వ సెలవు ఉంటే అంతకుముందు రోజే పంపిణీ చేస్తున్నామని పేర్కొన్నారు.పేదలు, బడుగు బలహీన వర్గాల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. పేదరిక నిర్మూలనకు అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్నామని తెలిపారు. నూతన పింఛన్ల దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను పారదర్శకంగా చేపడుతున్నామని, ఎలాంటి సిఫార్సులు, లంచాలకు తావులేకుండా కేవలం అర్హత ఆధారంగానే పింఛన్లు మంజూరు చేస్తామని అన్నారు.గత వైసీపీ ప్రభుత్వ హయాంలో వ్యవస్థలు నిర్వీర్యమయ్యాయని, ప్రజాధనం



దుర్వినియోగానికి పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని నరసింహ యాదవ్ స్పష్టం చేశారు. అమరావతి రాజధాని నిర్మాణంతో పాటు రాష్ట్రానికి జాతీయ, అంతర్జాతీయ స్థాయి పెట్టుబడులను ఆకర్షించే దిశగా చంద్రబాబు ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు.ఇదిలా ఉండగా, వైసీపీ నేతలు కులాల మధ్య చిచ్చుపెట్టి రాజకీయ లబ్ధి పొందేందుకు ప్రయత్నిస్తున్నారని ఆయన ఆరోపించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని కుల రాజకీయాలను ప్రేరేపించే ప్రయత్నాలను ప్రజలు తిప్పికొట్టాలని కోరారు. స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలనే ప్రభుత్వ నిర్ణయానికి వైసీపీ నేతలు న్యాయస్థానాల ద్వారా అడ్డంకులు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధికి కట్టుబడి ఉన్న ఎన్డీఏ కూటమి ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని నరసింహ యాదవ్ విజ్ఞప్తి చేశారు.

## దేవస్థాన పాలక మండలి సభ్యురాలిగా కనకదుర్గ



**గన్నవరం, సెప్టెంబరు 7 (వార్తా ప్రభ)** గన్నవరం నియోజకవర్గం ఉంగుటూరు మండలం పెదఅవుటుపల్లి గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ గంగా పార్వతి సమేత విశ్వేశ్వర స్వామి దేవస్థానం పాలక మండలి సభ్యురాలిగా పెదఅవుటుపల్లి జనసేన నాయకుడు తోట వెంకటేశ్వరరావు సతీమణి శ్రీమతి కనకదుర్గ ప్రమాణ స్వీకారం చేశారు.ఈ సందర్భంగా గన్నవరం నియోజకవర్గ జనసేన నాయకుడు, ఆంధ్రప్రదేశ్ రోడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ గరికిపాటి శివశంకర్ ఆమెను కలిసి అభినందించారు. నూతన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ దేవస్థానం అభివృద్ధికి, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు కృషి చేయాలని ఆకాంక్షించారు. అనంతరం కనకదుర్గను శాలువా కప్పి, పూలమాలతో ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా శివశంకర్ మాట్లాడుతూ.. దేవస్థానాల అభివృద్ధి, ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణలో పాలక మండలి సభ్యుల పాత్ర కీలకమన్నారు. భక్తుల విశ్వాసానికి అనుగుణంగా ఆలయ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కనకదుర్గకు అప్పగించిన బాధ్యతలను అంకితభావంతో నిర్వర్తించి దేవస్థానానికి మరింత సేవ చేయాలని ఆకాంక్షించారు.కనకదుర్గ ప్రమాణ స్వీకారం సందర్భంగా జనసేన నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పెదఅవుటుపల్లి జనసేన నాయకులు యర్రంశెట్టి దేవేందర్, అధికారి నాగరాజు, శిలం వరలక్ష్మి, పెనుమాక సంజు, ఆవుల వెంకట కోటయ్య, సుంకర సాంబశివ రాయల్, మారిశెట్టి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

## జీవీఎంసీ కూటమి మేయర్ అభ్యర్థిగా యాదవులకే ప్రాధాన్యత ఇవ్వాలి

**కూటమి నాయకులు, యాదవ సంఘాల డిమాండ్**



**విశాఖపట్నం, సెప్టెంబర్ 07(సిరా ప్రతినిధి):** రాబోయే జీవీఎంసీ ఎన్నికల్లో కూటమి తరఫున మేయర్ అభ్యర్థిగా యాదవ సామాజిక వర్గానికి చెందిన వారికే ప్రాధాన్యత ఇవ్వాలని యాదవ సంక్షేమ సంఘం, కూటమి యాదవ కుల నాయకులు కోరారు. ఈ సందర్భంగా రాంనగర్‌లోని ఓ ప్రముఖ హోటల్‌లోజిల్లా సంఘం నాయకులు వియ్యపు సత్యనారాయణ మూర్తి (మూర్తి యాదవ్) అధ్యక్షతన జరిగిన విలేకరుల సమావేశంలో విశాఖ జిల్లా యాదవ సంఘం అధ్యక్షుడు అక్రమాని వెంకట్రావు, యాదవ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు ప్రగాఢ చిన్నారావు పాల్గొని మాట్లాడారు.ఉత్తరాంధ్రతో పాటు రాష్ట్రవ్యాప్తంగా బీసీ వర్గాలలో యాదవులు నిర్ణయాత్మక శక్తిగా ఉన్నారని, ఒక్క విశాఖ జిల్లాలోనే 3 లక్షలకు పైగా ఓటర్లు ఉన్నారని నేతలు పేర్కొన్నారు. జనాభా నిష్పత్తికి తగినట్లుగా రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాల్సిన బాధ్యత కూటమిపై ఉందన్నారు. ఈ విషయమై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లకు త్వరలోనే వినతిపత్రం అందజేస్తామని తెలిపారు.

## ప్రభుత్వాసుపత్రిలో నర్సుల నిర్లక్ష్యం?

**రోగులకు సేవలందించాల్సిన సమయంలో నర్స్ ప్రశాంతంగా నిద్ర!**
**నిద్ర సమయంలో రోగులు బిగ్గరగా మాట్లాడవద్దు అంటూ హుకుం...**



**మచిలీపట్నం సెప్టెంబర్ 07::(వార్తా ప్రభ ప్రతినిధి)**మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రిలో సిబ్బంది పనితీరుపై రోజురోజుకూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రోగులకు వైద్యం అందిస్తూ, అత్యవసర పరిస్థితుల్లో అప్రమత్తంగా ఉండాల్సిన నర్సింగ్ సిబ్బంది విధి నిర్వహణ సమయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు తాజాగా చర్చనీయాంశంగా మారాయి.రోగులకు ఇంజక్షన్లు ఇవ్వడం, వైద్యులు సూచించిన మందులను సకాలంలో అందించడం, రోగుల ఆరోగ్య పరిస్థితిని నిరంతరం గమనించడం వంటి కీలక బాధ్యతలు నిర్వహించాల్సిన సమయంలో కొంతమంది నర్సులు బాతాఖానీలో నిమగ్నమై ఉండగా, మరో నర్స్ మాత్రం విధి నిర్వహణలో నిద్రిస్తోంది...

**నిద్రిస్తున్న నర్స్‌ను లేపకుండా... రోగులు మాట్లాడొద్దంటూ సూచనలు?** విధి సమయంలో నిద్రిస్తున్న నర్స్‌ను అప్రమత్తం చేయాల్సిన సహచర సిబ్బంది సైతం ఆమెకు అంతరాయం కలగకుండా వ్యవహరించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అంతేకాకుండా, "నర్స్ నిద్రపోతోంది.. రోగులు పెద్దగా మాట్లాడకండి" అంటూ పక్కన ఉన్న వారికి చెప్పటం గమనర్హం...రోగుల ఆరోగ్య పరిస్థితి ఎప్పుడు ఎలా మారుతుందో తెలియని ప్రభుత్వాసుపత్రిలో విధులు నిర్వహించే సిబ్బంది ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఎంతవరకు సమంజసం అంటున్నారు రోగుల బంధువులు..

## యువశ్రీకి శ్రీసిటీ ఎండీ అభినందనలు






**శ్రీసిటీ సెప్టెంబర్ 07::(వార్తా ప్రభ ప్రతినిధి):** రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత యువశ్రీ మురళికి శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఆయన ప్రతిభ, అంకితభావం, కృషికి ఈ గౌరవం నిదర్శనమని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత విజయాలు, పురస్కారాలు అందుకోవాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు.2024 లో శ్రీసిటీ శ్రీవాణి ఉగాది పురస్కారంతో యువశ్రీ మురళిని గౌరవించిన సందర్భాన్ని గుర్తుచేసుకున్న ఆయన, ఇలాంటి ప్రతిభావంతులను శ్రీవాణి ద్వారా సత్కరించుకోవడం గర్వంగా భావిస్తున్నామన్నారు.

## ఉపాధ్యాయులు జాతి వెన్నెముక



**విజయవాడ పశ్చిమ సెప్టెంబరు 7:(వార్త ప్రభ ప్రతినిధి )**దేశభవిష్యత్తు ఉపాధ్యాయుల మీద ఆధారపడి ఉంటుందని, జాతి సమగ్రతకు, అభివృద్ధికి ఉపాధ్యాయులు వెన్నెముకగా నిలుస్తారని కెబిఎన్ కళాశాల కార్యదర్శి డాక్టర్ టి.శ్రీనివాసు అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా వివిధ సంస్థల నుంచి ఉత్తమ ఉపాధ్యాయ సత్కారం అందుకున్న లెక్చరర్లకు సోమవారం కళాశాలలో అభినందన సభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న శ్రీనివాసు మాట్లాడుతూ విద్యతో పాటు సమాజ విషయాల పట్ల అవగాహన కల్పించి, బాధ్యత కలిగిన పౌరులుగా విద్యార్థులను తీర్చిదిద్దటంలో అధ్యాపకులు కీలకపాత్ర పోషిస్తారన్నారు. తమ కళాశాలలో పనిచేస్తున్న అధ్యాపకులు రాష్ట్రస్థాయి సత్కారాలను అందుకోవటం పట్ల హర్షం వ్యక్తం చేసారు. హిందూ హై స్కూల్స్ కమిటీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ వి.నారాయణరావు మాట్లాడుతూ సదరన్ ప్రైవేట్ లెక్చరర్స్, టీచర్స్ ఆర్గనైజేషన్ నుంచి తమ కళాశాల తెలుగు లెక్చరర్ డాక్టర్ జె.వి.చలపతిరావు; ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నుంచి కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వేంకటేశ్వరరావు, లెక్చరర్ ఎన్.సాంబశివరావు ఉత్తమ అధ్యాపక అవార్డులు పొందినట్లు చెప్పారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి మాట్లాడుతూ దైనందిన బోధనతో పాటు విద్యార్థులను రక్తదానం, సామాజిక సేవాకార్యక్రమాలు, స్వచ్ఛతా కార్యక్రమాల్లో పాల్గొనేలా తమ అధ్యాపకులు చైతన్యవంతులను చేసారని, వారి సేవలకు తగిన గుర్తింపు రావటం తమ కళాశాలకు దక్కిన గౌరవంగా భావిస్తున్నట్లు చెప్పారు. హిందూ హై స్కూల్స్ కమిటీ ట్రెజరర్ గోళ్ళ బాబా విజయ్ కుమార్, కెబిఎన్ కాలేజీ కమిటీ అధ్యక్షుడు ఉసిరిక ఉమామహేశ్వరరావు తదితరులు సభలో పాల్గొన్నారు.

## చేజర్లలో సీసీ కెమెరాలకు మరమ్మతులు





చేజర్ల సెప్టెంబర్ 09 (వార్తాప్రభ) చేజర్ల మండల నూతన ఎస్సై అయ్యప్ప బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి మండల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. చేజర్ల మండలంలో కొన్ని నెలలుగా పనిచేయని సీసీ కెమెరాల సమస్యను గుర్తించి వాటికి మరమ్మతులు చేయించి తిరిగి అందుబాటులోకి తీసుకొచ్చారు.అలాగే ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల దుకాణాల వద్ద వీలైనంత వరకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్సై సూచించారు.సీసీ కెమెరాల ద్వారా నేరాలు అసాంఘిక కార్యకలాపాలను అరికట్టడంతో పాటు అనుమానాస్పద వ్యక్తుల కదలికలను గుర్తించవచ్చన్నారు. కెమెరాలు పునరుద్ధరించడంతో మండల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

## ఆర్కే ఇంజనీరింగ్ కళాశాలకు ప్రతిష్ఠాత్మక ప్రతిష్ఠాత్మక 'ఎ' గ్రేడ్




ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 07(వార్తా ప్రభ ప్రతినిధి): మండల పరిధిలోని కేతనకొండ ఆర్కే కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కు జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీ కాకినాడ వారు ప్రతిష్ఠాత్మక ఏ గ్రేడ్ ప్రదానం చేశారు.తమ పరిధిలోని ఇంజనీరింగ్ కళాశాలల్లో ఆర్కే కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలు, మౌలిక సదుపాయాలు,ప్రయోగశాలలు, ఆధునిక ప్రమాణాలకు, ఉద్యోగ అవకాశాలు, నైపుణ్య కేంద్రాలు నిర్వహిస్తున్నందుకు గాను 2025--26 విద్యా సంవత్సరానికి ప్రతిష్ఠాత్మకమైన 'ఏ' గ్రేడ్ అందించారు.ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా సెప్టెంబర్ 5వ తేదీన జేఎన్టీయూ కాకినాడలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో, విశ్వవిద్యాలయ ఉపకులపతి చేతుల మీదుగా ఆర్కే కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ ప్రిన్సిపల్ డా కె రామకృష్ణయ్య అవార్డు అందుకున్నారు.జేఎన్టీయూ కాకినాడ పరిధిలోని సుమారు 160 ఇంజనీరింగ్ కళాశాలల్లో కేవలం 14 కళాశాలలకు మాత్రమే 'ఏ' గ్రేడ్ లభించగా, ఆ విశిష్ట జాబితాలో ఆర్కే కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ స్థానం సంపాదించుకోవడం కళాశాల విద్యా ప్రస్థానంలో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచిందని యాజమాన్యం పేర్కొంది.ఈ సందర్భంగా రామకృష్ణయ్య, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది మరియు విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ ప్రతిష్ఠాత్మక గుర్తింపును అందించిన జేఎన్టీయూ కాకినాడకు కళాశాల యాజమాన్యం మరియు సిబ్బంది ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు..

## కీసరలో లైటింగ్ లేక నివాసులు, భక్తులు ఇబ్బందులు

**ప్రజవాణి లో డిప్యూటీ కమిషనర్‌కు వినతిపత్రం**



కీసర, సెప్టెంబర్ 7(వార్తా ప్రభ):కీసర డివిజన్-1 పరిధిలోని కీసర గ్రామం, నందిని నగర్ కాలనీలో జనాభా పెరగడంతో ఇళ్లు అధికమయ్యాయి. అయితే సరైన లైట్ స్తంభాలు లేకపోవడం వల్ల రాత్రిపూట చీకటి వల్ల నివాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మహిళలు, పిల్లలు, పెద్దవారు సురక్షితంగా నడవలేని పరిస్థితి నెలకొంది.అదేవిధంగా, వినాయక చవితి సందర్భంగా కీసర డివిజన్-1 పరిధిలోని ఉన్న అన్ని గ్రామాల్లోని వినాయక మండపాల వద్ద కరెంట్ స్తంభాలకు లైట్లు లేకపోవడం వల్ల భక్తులు చీకటిలో ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా మహిళలు, చిన్నపిల్లలు, వృద్ధులు రాత్రిపూట మండపాల వద్ద నడవడానికి భయపడుతున్నారు.ఈ సమస్యల పరిష్కారం కోసం స్థానిక నాయకులు కీసర డిప్యూటీ కమిషనర్‌కు వినతిపత్రం ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో కీసర మండల సామాజిక సేవా కార్యకర్త తుడుం శ్రీనివాస్, మాజీ ట్రస్ట్ బోర్డ్ మెంబర్, కీసరగుట్ట, రాగుల రమేష్ ముదిరాజ్ కీసర గ్రామ శాఖ కాంగ్రెస్ పార్టీ ఆద్యక్షులు జూపల్లి రవీందర్, కృష్ణ రెడ్డి, పండుగ రాజలింగం ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## టీటీడీ ఎస్వీ గోసంరక్షణ ట్రస్ట్‌కు రూ.1.11 కోట్ల భారీ విరాళం

**హైదరాబాద్ బంజారాహిల్స్‌కు చెందిన కుంచాల మధురాం రెడ్డి విరాళం**

**తిరుమల సెప్టెంబర్ 07::(వార్తా ప్రభ ప్రతినిధి):** టిటిడి ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న శ్రీవేంకటేశ్వర గోసంరక్షణ ట్రస్ట్‌కు హైదరాబాద్ బంజారాహిల్స్‌కు చెందిన ప్రముఖ దాత శ్రీ కుంచాల మధురాం రెడ్డి రూ.1.11 కోట్ల భారీ విరాళాన్ని అందించారు. సోమవారం హైదరాబాద్ క్యాంపు కార్యాలయంలో టీటీడీ చైర్మన్ శ్రీ బి.ఆర్. నాయుడును కలిసి దాత ఈ విరాళాన్ని అందజేశారు. గోసంరక్షణ, గోసేవకు పెద్దపీట వేస్తున్న టీటీడీకి అండగా నిలిచి, భారీ విరాళం అందించిన దాత కుంచాల మధురాం రెడ్డిని చైర్మన్ బి.ఆర్. నాయుడు అభినందించారు. గోవుల సంరక్షణకు దాతలు అందిస్తున్న సహకారం ఎంతో విలువైనదని, భక్తులు, దాతల సహకారంతో టీటీడీ గోసంరక్షణ కార్యక్రమాలను మరింత విస్తృతంగా కొనసాగిస్తుందని తెలిపారు.

# భార్య ని హతమార్చిన కీచక భర్త.

**కన్న పిల్లే 'తల్లిని తండ్రి చంపిండు' అని మీడియా ముందుకు వచ్చిన చిన్నారు భవ్య**





**పెనుగంచిప్రోలు - సెప్టెంబర్ 7 ( వార్త ప్రభ)** పెనుగంచిప్రోలు గ్రామంలో తూర్పు బజారు దళిత వాడలో కట్టుకున్న భార్యను హతమార్చిన భర్త దారుణం చోటుచేసుకుంది.పెనుగంచి ప్రోలు గ్రామంలో తూర్పు బజార్ దళిత వాడ లో ఉండేనందిగామ సపల(30) కు నందిగామ శ్రీనాథ్ అనే వ్యక్తికి గత తొమ్మిది సంవత్సరాలు క్రితం వివాహం జరిగింది. వీరి కీ ఇద్దరు పిల్లలు జన్మించారు. పెద్ద కుమార్తె పేరు భవ్య వయసు 8 సంవత్సరాలు, రెండవ కుమారుడు పేరు నిహాన్. గత 4 సంవత్స రా ల నుండి మద్యానికి బానిసై భార్యాభర్తల మధ్య వాదోపవాదాలు, గొడవలు జరుగుతున్నాయని ముచింతాల గ్రామానికి చెందిన కొంతమంది మరియు తల్లిదండ్రులు బంధువులు ఆరోపిస్తున్నారు.పెనుగంచిప్రోలు గ్రామం లో గత రాత్రి భార్యాభర్తల గొడవ వల్ల మద్యం మత్తులో ఈ సంఘటన చోటు చేసుకుందని అంటున్నారు. సపల భర్త అయిన నందిగామ.శ్రీనాథ్. తన భార్యను కళాయితో తల మీద వెనక భాగాన కొట్టినట్టు అనంతరం మద్యం మత్తులో తన భార్యను దుర్భాషలాడుతూ వాళ్ళ ఇంటి ఆవరణలో ఉన్నటువంటి బాత్రూం తీసుకువెళ్లి చిన్ని తో ఉరివేసినట్టు తెలిపారు.తన పిల్లలు బంధుమిత్రులు కూడ ఇలాగే తెలియజేస్తున్నారు. ఉరి వేసుకున్న వెంటనే తనకు పుట్టిన పెద్ద కుమార్తె అయిన భవ్య చుట్టుపక్కల వారిని కేక లు వేసి మా నాన్న మా అమ్మను కొడుతున్నాడు బాత్రూం లోకి తీసుకువెళ్లాడని కేకలు వేస్తూ అందరికి చెప్పగానే చుట్టుపక్కల వారు వచ్చి అప్పటికే ఉరివేసి ఉన్న నందిగమ సపల ను చూసి మరణించి ఉన్నదని తెలుసుకున్నారు. అక్కడ ఉన్నవారు. వెంటనే పోలీసువారికి తెలపగానే మృతురాలు ఇంటి వద్దకి పోలీస్ వారు వచ్చారు. మృతురాలు పుట్టినిల్లు అయిన ముచ్చింతల గ్రామం వారు బంధుమిత్రులకు తెలియపరచగాన్నే మృతురాలు ఇంటికి వచ్చినారు.. అనంతరం. పోలీసు వారు మృతురాలి ని వెంటనే జగ్గయ్యపేట ప్రభుత్వ ఆసుపత్రికీ తరలించారు.నందిగామ. శ్రీనాథ్ భార్యను బాత్రూంలో ఉరి వేసాడని తన పిల్లలు బంధువులు అతని మీద కేసు ఫైల్ చేసి చేసిన దర్యాప్తు చేయమని బాధితులు పోలీస్ స్టేషన్ ఎస్ ఐ అర్జున్ కీ తెలిపారు.జగ్గయ్యపేట తీసుకువెళ్లి మృతురాలని పోస్ట్మార్టర్ చేసి పెనుగంచిప్రోలు తన స్వగృహమునకు తీసుకురాగా మృతురాలి బంధువులు గగ్గోలు పెడుతూ ఏడుస్తూ వారికి పుట్టిన పిల్లలకి న్యాయం చేసి కొరకు మేము కదలము అన్నారు.అక్కడ ఉన్న గ్రామ పెద్దలు, ఇరువర్గాలు పెద్దలు చర్చలు జరుపు తున్నారు. మృతు రాలు బంధువులు సపల కీ పుట్టిన పిల్లలకు న్యాయం చేసే వారకు మేము ఇక్కడ నుంచి కదలమని మృత దేహం వద్ద కూర్చున్నారు.ముద్దాయి నీ పోలీస్ స్టేషన్ తీసుకెళ్లి విచారిస్తున్న పోలీసులు.మృతురాలు బంధువులు పిల్లల కు న్యాయం చేయాలని పెద్దలను కోరారు.దళిత వాడ పెద్దలు, పోలీసు వారు అనుమతితో మృతురాలు పిల్లలకు న్యాయం జరిగే విదంగా కొన్ని నిర్ణయాలు తీసుకోని సపల మృత దేహానాని సమాధి చేశారు..

# ఆర్అండ్‌బీ రోడ్ల పునర్నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే

**● వరదలతో దెబ్బతిన్న రహదారులకు పునరుజ్జీవనం ● ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా రహదారుల అభివృద్ధికి ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య ప్రత్యేక చొరవ**



**పెనుగంచిప్రోలు - సెప్టెంబర్ 7( వార్త ప్రభ )** ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల కారణంగా పెనుగంచిప్రోలు, వత్సవాయి మండల పరిధిలోని దెబ్బతిన్న ఆర్అండ్‌బీ రహదారుల పునర్నిర్మాణ పనులకు జగ్గయ్యపేట నియోజకవర్గ శాసనసభ్యులు, తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు శ్రీ శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) సోమవారం శంకుస్థాపన చేశారు. పెనుగంచిప్రోలు శృతి కన్వెన్షన్ హాల్ వద్ద జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కొబ్బరికాయ కొట్టి రహదారి పునర్నిర్మాణ పనులను ప్రారంభించారు.ఇటీవల సంభవించిన భారీ వర్షాలు, వరదల కారణంగా నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో రహదారులు దెబ్బతినడంతో ప్రజలు, వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ సమస్యను ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి, ప్రజలకు ఇబ్బందులు లేకుండా రహదారులను త్వరితగతిన పునరుద్ధరించేందుకు ప్రత్యేక చొరవ తీసుకున్నారు.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. ముఖ్యమంత్రి సహకారం, ఆర్అండ్‌బీ శాఖ మంత్రి బి.సి జనార్ధన్ రెడ్డి సహకారంతో నియోజకవర్గంలో దెబ్బతిన్న రహదారుల పునర్నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేయించి పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు.రూ.3.37 కోట్లతో సుమారు 8 **కిలోమీటర్ల మేర రహదారుల పునర్నిర్మాణం** పెనుగంచిప్రోలు,వత్సవాయి మండల పరిధిలోని ముచ్చింతల, వత్సవాయి, వేమవరం, గుమ్మడిదూరు, అనిగండ్లపాడు, కాకరవాయి తదితర ప్రాంతాలను కలిపే ప్రధాన రహదారులను సుమారు రూ.3 కోట్ల 37 లక్షల వ్యయంతో, దాదాపు 8 కిలోమీటర్ల మేర పునర్నిర్మాణం చేపడుతున్నారు.ఈ రహదారుల పునర్నిర్మాణ పనులు పూర్తయితే ఆయా గ్రామాల ప్రజలకు రాకపోకలు మరింత సులభతరం కానున్నాయి. ముఖ్యంగా విద్యార్థులు, రైతులు, ఉద్యోగులు, వ్యాపారులు, ప్రజా రవాణా వాహనాలు, ద్విచక్ర వాహనదారులకు ఎంతో ప్రయోజనం చేకూరనుంది.జగ్గయ్యపేట నియోజకవర్గంలో రహదారులు, విద్య, తాగునీరు, విద్యుత్, గ్రామీణ మౌలిక వసతులు తదితర రంగాల్లో ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) ప్రత్యేక శ్రద్ధతో అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళుతుండటంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకొని వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయించడంతో పాటు పనులు త్వరితగతిన జరిగేలా ఎమ్మెల్యే చొరవ చూపుతున్నారని స్థానికులు పేర్కొన్నారు. ముఖ్యంగా వరదలతో దెబ్బతిన్న రహదారుల పునర్నిర్మాణానికి ప్రాధాన్యత ఇవ్వడంపై ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించడం, సురక్షితమైన రాకపోకలకు రహదారులను అందుబాటులోకి తీసుకురావడం తన ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) తెలిపారు. నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, కూటమి ప్రభుత్వ సహకారంతో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను చేపడతామని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో శ్రీ తిరుపతమ్మ అమ్మ వారి ఆలయ చైర్మన్ చుంచు రమేష్ బాబు పెనుగంచిప్రోలు సొసైటీ అధ్యక్షులు కర్ల వెంకట నారాయణ,పోలంపల్లి డ్యామ్ చైర్మన్ పొన్నం బాలాజీ మాజీ ఎంపిపి వేగినేటి గోపాల కృష్ణ మూర్తి అనిగండ్ల పాడు సొసైటీ అధ్యక్షులు అత్తు లూరి అచ్యుత్ రావు మాజీ జెడ్ పి టీ సి గజ్జి కృష్ణ మూర్తి,మై నార్టీ సెల్ నాయకులు మహమ్మద్ అజాద్ నల్లపునేని కొండ తాటి పూడి సత్యం బాబు పద్మాల వెంకటేశ్వర రావు తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి నలమోలుశ్రీ రామ ప్రసాద్ మాజీ ఎంపిపి పొన్నం నరసింహ రావు, మాజీ సర్పంచ్ జిల్లేపల్లి సుదీర్ బాబు నీటి సంఘం అధ్యక్షులు కర్ల నాగేశ్వర రావు, నూతల పాటి కృష్ణ నలజాల రాజు కంభం చిరంజీవి ఆర్అండ్‌బీ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# అమలాపురంలో కదం తొక్కిన ఆక్వా రైతులు

**'చలో అమలాపురం'కు వేలాది మంది తరలింపు..సీడ్, ఫీడ్ ధరలు తగ్గించాలని డిమాండ్..**



**అమలాపురం సెప్టెంబర్ 07::(వార్తా ప్రభ ప్రతినిధి):** ఆక్వా రైతుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో ఆక్వా రైతులు భారీ ర్యాలీ నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వేలాది మంది రైతులు తరలివచ్చి 'చలో అమలాపురం' మహాసభలో పాల్గొన్నారు. పేరూరు వై జంక్షన్ నుంచి అమలాపురం క్షత్రియ కళ్యాణ మండపం వరకు ర్యాలీగా వచ్చిన రైతులు పెరిగిన సీడ్, ఫీడ్ ధరలను వెంటనే తగ్గించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం 'ఆక్వా రైతు బతుకు పోరాటం' పేరుతో బహిరంగ సభ నిర్వహించారు.ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. తమ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ సిఫార్సులను అమలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వేలాది మంది రైతులు రోడ్డెక్కి తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువస్తున్నా స్పందన లేకపోవడం బాధాకరమన్నారు. పెరిగిన సీడ్, ఫీడ్ ధరలతో ఆక్వా సాగు భారంగా మారిందని, రైతుల సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని కోరారు. కమిటీ సిఫార్సులను వెంటనే అమలు చేసి ఆక్వా రంగాన్ని, రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

# వి క్యూబ్ సాఫ్ట్ వేర్ చేయూత..,



**గుడ్లవల్లేరు: సెప్టెంబర్ 07::(వార్తా ప్రభ ప్రతినిధి)**మండలంలోని రెడ్డిపాలానికి చెందిన వి క్యూబ్ సాఫ్ట్ వేర్ సొల్యూషన్స్ సంస్థ అధినేత పామర్తి వీర రాఘవులు వరంగల్ మల్లి కాంబ మానవికాస కేంద్రంలోని విద్యార్థుల మధ్య ప్రత్యేక కార్యక్రమాన్ని ఘన ంగా నిర్వహించినట్లు మండల పరిధిలో ని రెడ్డిపాలెం గ్రామం నందు సంస్థ అధి నేత పామర్తి వీర రాఘవులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మల్లికాంబ మానవికాస కేంద్రంలో పని చేస్తున్న ఉపాధ్యాయులు, ఉద్యోగులకు రూ.లక్ష నగదు సహాయాన్ని అందజేశారు. ఈ విషయాన్ని ఆయన సోమవారం తెలిపారు. అలాగే విద్యార్థుల మానసిక వికాసానికి, వారి శక్తి సామర్థ్యాలను పెం పొందించేందుకు ఉపయోగపడే రూ.30వేల విలువైన వస్తువులను అందించారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులు, విద్యార్థులతో కలిసి ఈ సందర్భంగా భోజన సదుపాయాన్ని కూడా ఏర్పాటు చేశారు. విద్యార్థుల సంక్షేమంతో పాటు మల్లికాంబ మానవికాస కేంద్రంలో పని చేస్తున్న సిబ్బందికి అండగా నిలవాలనే ఉద్దేశంతో, వి క్యూబ్ ఫౌండేషన్ తరపున ప్రతి నెల రూ.50వేలను ఉద్యోగుల జీతాల రూపంలో ఆర్థిక సహాయంగా అందించేం దుకు ముందుకు వచ్చినట్లు వీర రాఘవులు తెలిపారు. విద్యార్థుల అభివృద్ధి, సిబ్బంది సంక్షేమం కోసం భవిష్యత్తులోనూ ఇలాంటి సేవా కార్యక్రమాలకు రూ.లక్ష చెక్కు అందజేశారు.

## బీసీ, జౌళి శాఖ మంత్రి శ్రీమతి సవితమ్మ ని విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్ పర్సన్ శ్రీమతి కమ్మరి పార్వతమ్మ కు వినతిపత్రం అందజేసిన డైరెక్టర్ తునికి పాటి శివ.....



**పెనుగంచిప్రోలు - సెప్టెంబర్ 7( వార్త ప్రభ )**అమరావతిలో రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మాత్యులు శ్రీమతి సవితమ్మ గారిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంక్షేమ మరియు అభివృద్ధి కార్పొరేషన్ చైర్ పర్సన్ శ్రీమతి కమ్మరి పార్వతమ్మ ను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేసిన విశ్వ బ్రాహ్మణ కార్పొరేషన్ డై రెక్టర్ తునికి పాటి శివా. ఈ సందర్భంగా సెప్టెంబర్ 17న జరగనున్న విశ్వకర్మ జయంతి యజ్ఞ మహోత్సవాన్ని రాష్ట్రస్థాయి వేడుకగా నిర్వహించాలని కోరుతూ వినతిపత్రం పెనుగంచిప్రోలు కు చెందిన విశ్వ బ్రాహ్మణ కార్పొరేషన్ డై రెక్టర్ తునికి పాటి శివా అందచేశారు.ప్రతి సంవత్సరం ప్రభుత్వం జీ.ఓ. ఇచ్చి, నిధులు కేటాయించి ఈ వేడుకను అధికారికంగా నిర్వహిస్తున్న విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.ఈ ఏడాది వేడుకను విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో మంత్రి సవితమ్మ అధ్యక్షతన, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు , ఉప ముఖ్యమంత్రి వర్యులు కొణిదల పవన్ కళ్యాణ్ విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ని ప్రత్యేక అతిథులుగా ఆహ్వానించి ఘనంగా నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు.దీనికి మంత్రి సవితమ్మ సానుకూలంగా స్పందిస్తూ, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని కమ్మరి పార్వతమ్మ తెలిపారు.

## పేద ప్రజలకు నాణ్యమైన ఉచిత వైద్య సేవలు...





**గుడ్లవల్లేరు, సెప్టెంబర్ 07::(వార్తా ప్రభ ప్రతినిధి)** రాష్ట్ర భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు డాక్టర్ సి.ఎల్ వెంకటరావు పల్లెల్లో పేద ప్రజలకు నాణ్యమైన ఉచిత వైద్య సేవలను అందిస్తున్నారు. ఆదివారం జిల్లాలోని నలుమూలల నుంచి వచ్చిన 592మందికి గుడ్లవల్లేరు వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు చేశారు. గ్యాస్ట్రోఎంట్రాలజీ ఆరోగ్య సమస్యలతో బాధ పడుతున్న రోగులకు డాక్టర్ సి.ఎల్ వెంకటరావు, నేత్ర సమస్యలకు ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి టెక్నీషియన్లు హనుమకొండ దుర్గ భవాని, కణితి శశిరేఖ, గుండె, ఊపిరితిత్తుల సమస్యలకు విజయవాడ కామినేని హాస్పిటల్ వైద్య బృందం తమ వైద్య సేవలను రోగులకు అందించారు. అనంతరం అవసరమైన రోగులకు డాక్టర్ సి ఎల్ వెంకటరావు చేతుల మీదుగా ఉచిత మందులను పంపిణీ చేశారు.

## స్థానిక ఎన్నికలకు క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయాలి

**- ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్**



**ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 7 (వార్తా ప్రభ ప్రతినిధి):** క్షేత్ర స్థాయిలో బీజేపీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్ అన్నారు. ఇబ్రహీంపట్నం రూరల్ మండల ఆత్మ నిర్భర్ కార్యవర్గ సమావేశం కాచవరంలోని బీసీ మోర్చా అధ్యక్షుడు జి.మురుగేష్ స్వగృహంలో మండల అధ్యక్షురాలు పయ్యావుల జయలక్ష్మి అధ్యక్షతన సోమవారం జరిగింది. జిల్లా అధ్యక్షుడు శ్రీరామ్ సమావేశంలో పాల్గొన్న మండల కమిటీ సమాచారాన్ని సేకరించి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రతిఏటా సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు సేవా పక్వాడ్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ ఏడాది సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు జరగనున్న సేవా సంకల్పం అభియాన్ కార్యక్రమం పై చర్చించారు. అనంతరం 30 కుటుంబాలు బీజేపీలో చేరాయి. వారికి జిల్లా అధ్యక్షుడు శ్రీరామ్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా బీజేపీ ఇన్ చార్జి నార్ని తాతాజీ, ఇబ్రహీంపట్నం రూరల్ మండల ఇన్ చార్జి చిగురుపాటి లక్ష్మి, జిల్లా ప్రధాన కార్యదర్శి గోవింద్, ట్రెజరర్ బుల్లబ్బాయి, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి పయ్యావుల రాము తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ వేంకటేశ్వరుని సన్నిధిలో భక్తకోటి రద్దీ...



**గుడ్లవల్లేరు: సెప్టెంబర్ 07::(వార్తా ప్రభ ప్రతినిధి)**మండలంలోని డోకిపర్రు మహాక్షేత్రంలోని భూ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో స్వామివారిని దర్శించుకునేందుకు భక్తజనం బారులు తీరటంతో ఆలయ ప్రాంగణమంతా రద్దీగా మారింది. భక్తులు తమ తమ మొక్కుబడులను భక్తి ప్రపత్తులతో తీర్చుకున్నారు. దూర ప్రాంతాల నుండి వచ్చిన వేలాది మంది భక్తులకు భారీ అన్న సమారాధనను నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్(మెయిల్) అధినేత, దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్తలు పురిటిపాటి వేంకట కష్ణారెడ్డి, సుధారెడ్డి ఆర్థిక సాయంతో జరిగిందని నిర్వాహకులు కొమ్మారెడ్డి బాపిరెడ్డి, విజయ భాస్కరమ్మ తెలిపారు. వేలాది మంది భక్తులు అన్న ప్రసాదాల్ని స్వీకరించారన్నారు. తొలుత స్వామివారికి విశేషాభిషాకాలతో పాటు ప్రత్యేక పూజల్ని వేద పండితులు చేపట్టారు. స్వామివారి దర్శనానికి అధికసంఖ్యలో భక్తులు బారులు తీరారు. స్వామివారు సర్వ పుష్పాలంకరణతో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులు తీర్థ ప్రసాదాల్ని స్వీకరించారు.

# వినాయక మండపాలకు ఆన్‌లైన్‌లోనే అనుమతులు

– టూ టౌన్ పోలీసుల సూచన




**గుడివాడ,సెప్టెంబర్ 7 (వార్తాప్రభ) :** గుడివాడ టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో వినాయక మండపాలు ఏర్పాటు చేయదలచిన నిర్వాహకులు ఆన్‌లైన్‌లోనే అనుమతుల కోసం దరఖాస్తు చేసుకోవాలని స్టేషన్ హౌస్ ఆఫీసర్ తెలిపారు. వినాయక చవితి సందర్భంగా మండపాల ఏర్పాటుకు ganeshutsav.net వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

**దరఖాస్తు విధానం :** 1) ganeshutsav.net వెబ్‌సైట్‌లోకి వెళ్లి NEW APPLICATION పై క్లిక్ చేయాలి 2) మొబైల్ నంబర్ ఎంటర్ చేసి వచ్చిన OTP తో ధృవీకరించాలి3) వివరాలు నమోదు చేసి దరఖాస్తు సమర్పించాలి 4) Application Status లో స్థితిని తెలుసుకోవచ్చు 5) ఆమోదం తర్వాత NOC, QR కోడ్‌ను డౌన్‌లోడ్ చేసుకుని మండపం వద్ద ప్రదర్శించాలి ఈ ప్రక్రియకు ఎటువంటి రుసుము లేదని, నిర్వాహకులు ముందస్తుగా దరఖాస్తు చేసుకుని పోలీస్ శాఖ అనుమతులు పొందాలని ఎస్హెచ్వో కోరారు.

# శ్రీ విఘ్నేశ్వర స్వామి ఆలయంలో హుండీ లెక్కింపు..

-4 నెలల 15 రోజులకు రూ.5,64,055/- ఆదాయం





**గుడివాడ,సెప్టెంబర్ 7 (వార్తాప్రభ) :** స్థానిక మెయిన్ రోడ్డులో వేంచేసి ఉన్న శ్రీ విఘ్నేశ్వర స్వామి వారి దేవస్థానంలో స్వామివారి హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని దేవాదాయ శాఖ ఇన్స్పెక్టర్ సుధాకర్ పర్యవేక్షణలో సోమవారం నిర్వహించారు. దేవస్థాన ధర్మకర్తల కమిటీ ఆధ్వర్యంలో జరిగిన హుండీ లెక్కింపు కార్యక్రమంలో ఆధ్యాత్మిక సంఘాల ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు. దేవాదాయ శాఖ నిబంధనల ప్రకారం హుండీలోని కానుకలను లెక్కించారు. లెక్కింపు అనంతరం వివరాలను ఆలయ దేవస్థాన ఈ వో యార్లగడ్డ వాసు వెల్లడించారు. నాలుగు నెలల 15 రోజుల కాలంలో భక్తులు స్వామివారికి సమర్పించిన కానుకలను లెక్కించగా రూ.5 లక్షల 64 వేల 55 రూపాయలు ఆదాయంగా వచ్చినట్లు ఈ.వో. తెలిపారు.

**14 నుంచి గణపతి నవరాత్ర మహోత్సవాలు..** ఈనెల 14వ తేదీ నుంచి గణపతి నవరాత్ర మహోత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆలయంలో ఉత్సవ ఏర్పాట్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయని ధర్మకర్తల కమిటీ చైర్మన్ సాయన రాజేష్ తెలిపారు. నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయ పరిసరాల్లో ప్రత్యేకంగా చలువ పందిళ్లను ఏర్పాటు చేయడంతో పాటు, తొమ్మిది రోజుల పాటు నిర్వహించనున్న సాంప్రదాయ సాంస్కృతిక ప్రదర్శనలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు సంబంధించిన ఏర్పాట్లను పూర్తి చేసినట్లు వెల్లడించారు. గణపతి నవరాత్ర మహోత్సవాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని సాయన రాజేష్ కోరారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు లోయ వాసు, పంచుమర్తి శ్రీనివాసరావు, ముళ్ళపూడి రమణమూర్తి, విక్కుర్తి పోతురాజు, వీరమాచినేని శైలజ, చాపరాల విజయలక్ష్మి, సోసుపల్లి శారద, గొంతుపుల్లి కనకదుర్గ, గణపతి శాస్త్రి, ఆలయ సిబ్బంది నారాయణ, దేవాదాయ శాఖ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# కొత్త పింఛన్లకు దరఖాస్తుల స్వీకరణ

-సెప్టెంబరు 7 నుంచి 16 వరకు..



**గుడివాడ,సెప్టెంబర్ 7 (వార్తాప్రభ) :** కొత్త ఎన్టీఆర్ భరోసా పింఛన్లకు అర్హులైన వారి నుంచి సెప్టెంబరు 7 నుంచి 16 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము తెలిపారు. వృద్ధాప్య, వితంతు, ఒంటరి మహిళ, దివ్యాంగుల పింఛన్లకు అర్హులు ఆయా గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆధార్, రేషన్ కార్డు/ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో పాటు సంబంధిత కేటగిరీకి అవస రమైన పత్రాలను సమర్పించాలన్నారు. పింఛన్ ఇప్పిస్తామని చెప్పే దళా రులను ఆశ్రయించవద్దని, ఎవరికి డబ్బులు ఇవ్వొద్దని స్పష్టం చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరూ గడువు ముగిసేలోగా దరఖాస్తు చేసుకోవాలని ఎమ్మెల్యే రాము కోరారు.

# గుడివాడలో ఘనంగా పాత్రికేయుల దినోత్సవం



**గుడివాడ,సెప్టెంబర్ 7 (వార్తాప్రభ) :** వాసవి జాగృతి క్లబ్ ఆధ్వర్యంలో పాత్రికేయుల దినోత్సవ వేడుకలు శ్రీ కన్యకా పరమేశ్వరి ఆలయ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పల్లెబాట విలేకరి డిఆర్బీ ప్రసాద్, శ్రీనివాసరావు లను ఘనంగా సత్కరించారు. అనంతరం విలేకరుల చేతుల మీదుగా 6గురు నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షులు శేగు వెంకట ప్రసాద్ మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థలు చేసే సేవా కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్న ప్రింట్ మీడియాకు ధన్యవాదాలు తెలిపారు. సన్మాన గ్రహీతలు మాట్లాడుతూ జాగృతి క్లబ్ నిరంతరం చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని, తమ చేతుల మీదుగా సేవా కార్యక్రమం నిర్వహించడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ కో–ఆర్డినేటర్ శేగు బబిత, గాదె మోహన్ బాబు, క్లబ్ కార్యదర్శి హరినాథ్ బాబు, కోశాధికారి బచ్చు ఉమామహేశ్వరరావు, సభ్యులు మాజేటి శివ నాగేశ్వరరావు, ఈశ్వరరావు, మునగ శరత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు



**హనుమాన్ జంక్షన్,సెప్టెంబర్ 7 (వార్తాప్రభ) :** హనుమాన్ జంక్షన్‌లోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు సోమవారం వైభవంగా నిర్వహించారు. శ్రావణమాసం, ఏకాదశి, సోమవారం కావడంతో ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దేవాలయ ఫౌండర్ ట్రస్టీ కాకాని అరుణ, కాకాని బాబు దంపతుల ఆధ్వర్యంలో గత ఐదేళ్లుగా భక్తులకు ఉచితంగా సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలను క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నారు. వ్రతానికి హాజరయ్యే భక్తులకు పసుపు, కుంకుమ, పూలు, పండ్లు, రూపు, నూతన వస్త్రం, కొబ్బరికాయలను ఉచితంగా అందజేస్తున్నారు. అదేవిధంగా ప్రతి నెల శ్రీ వేంకటేశ్వర స్వామి వారి జన్మనక్షత్రాన్ని పురస్కరించుకుని సామూహిక వేంకటేశ్వర స్వామి వ్రతాలను కూడా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తులకు ఆధ్యాత్మిక సేవలను అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు. సోమవారం ఉదయం ఆలయ ప్రాంగణంలో భక్తుల సమక్షంలో దేవాలయ అర్చకులు చక్రావధానుల సీతారామాచార్యులు, ఇతర అర్చక స్వాముల మంత్రోచ్చారణల నడుమ సత్యనారాయణ స్వామి సామూహిక వ్రతాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. వ్రతంలో పాల్గొన్న భక్తులు స్వామివారిని భక్తిశ్రద్ధలతో పూజించి తమ కుటుంబాలకు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని ప్రార్థించారు. వ్రతం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు కార్యక్రమంలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణం భక్తుల ఆధ్యాత్మిక సందడితో కళకళలాడింది.

# గుడివాడలో "భారత్ కో జానో" క్విజ్ పోటీలు



**గుడివాడ,సెప్టెంబర్ 7 (వార్తాప్రభ) :** భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో స్థానిక కైకాల సత్యనారాయణ పురపాలక కళామందిరంలో సోమవారం 'భారత్ కో జానో' క్విజ్ పోటీలు నిర్వహించారు. సోమవారం ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు జరిగిన ఈ పోటీల్లో పట్టణంలోని మున్సిపల్, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు రెండు విభాగాల్లో పాల్గొన్నారు. జూనియర్ విభాగంలో 13 స్కూళ్లు, సీనియర్ విభాగంలో 16 స్కూళ్లు పోటీ పడ్డాయి. ముఖ్య అతిథిగా హాజరైన గుడివాడ ఎంఈఓ బి. బాలాజీ నాయక్ విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. విజేతల వివరాలు : జూనియర్ విభాగం : ప్రథమ బహుమతి – ఏకేటీపీ మున్సిపల్ హైస్కూల్, ద్వితీయ – కె.ఆర్. గౌతమ్స్, తృతీయ, చతుర్థ, పంచమ బహుమతులు – హోలీ క్రాస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్స్ జూనియర్ విభాగం : ప్రథమ – సిద్ధార్థ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్, ద్వితీయ – ది ఇంగ్లీష్ మీడియం స్కూల్, తృతీయ, పంచమ – హోలీ క్రాస్ ఇంగ్లీష్ మీడియం, చతుర్థ – విద్యాలయ ఇంగ్లీష్ మీడియం స్కూల్స్ క్విజ్ మాస్టర్లుగా కొమ్ము వెంకటేశ్వర్లు, పి.ఎల్.వి. సుబ్రహ్మణ్యం లు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో పరిషత్ అధ్యక్షులు సామి రామ్మోహన్, కార్యదర్శి తిరుపాల్ గుప్తా, జాయింట్ సెక్రటరీ చలవాది సురేష్, కోశాధికారి పి. రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# వేగిరెడ్డి బాలాజీ జన్మదిన వేడుకలు

## చలమల శెట్టి ఆధ్వర్యంలో



**హనుమాన్ జంక్షన్,సెప్టెంబర్ 7 (వార్తాప్రభ) :** బాపులపాడు మండల ప్రేమికులు, బ్యాంక్ ఆఫ్ ఇండియా కరస్పాండెంట్ వేగిరెడ్డి బాలాజీ జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. జనసేన నాయకుడు చలమలశెట్టి రమేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రాజకీయాలకు అతీతంగా పలువురు నాయకులు, ప్రముఖులు పాల్గొన్నారు. బాలాజీ చేత కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దయ్యాల రాజేశ్వరరావు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు వేగిరెడ్డి పాపారావు, గన్నవరం నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షుడు చింతల వెంకట శివ అప్పారావు, కొల్లి బుజ్జి, వేగిరెడ్డి నరసింహబాబు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ పంచాయతీ సర్పంచ్ రేసులో గజ్జి కృష్ణ మూర్తి యాదవ్



**పెనుగంచిప్రోలు,సెప్టెంబర్ 7 (వార్తాప్రభ) :** ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలు మేజర్ గ్రామ పంచాయతీ అధ్యక్ష పదవి బి సీ.కి కేటాయిస్తే, తెలుగుదేశం పార్టీ ఆదేశిస్తే పంచాయతీ అభ్యర్థిగా పోటీ చేసేందుకు మాజీ జెడ్పీటీసీ సభ్యుడు గజ్జి కృష్ణ మూర్తి సిద్ధంగా ఉన్నట్లు ఆయన అనుచరుల్లో చర్చ జరుగుతోంది. పార్టీ అధిష్ఠానం అవకాశం కల్పిస్తే సర్పంచ్ అభ్యర్థిగా బరిలోకి దిగేందుకు తాను సిద్ధంగా ఉన్నానని కృష్ణ మూర్తి యాదవ్ తన సన్నిహితుల వద్ద చెబుతున్నట్లు సమాచారం. ఎన్నికల విధానం అమల్లోకి వస్తే పరిస్థితులను బట్టి బరిలోకి దిగే అవకాశాలను కూడా పరిశీలిస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. స్థానికంగా ఉన్న గుర్తింపు, గతంలో జెడ్ పి టీ సి సభ్యులు గా పని చేసి ప్రజల తోఉన్న అనుబంధంనాయకత్వం కలిసొస్తాయంటున్న టీడీపీ కార్యకర్తలు పెనుగంచిప్రోలు లో ఉన్న వ్యక్తిగత గుర్తింపు, ప్రజలతో ఉన్న పరిచయాలు, నాయకత్వ లక్షణాలు సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేస్తే ఆయనకు కలిసొచ్చే అంశాలుగా తెలుగుదేశంపార్టీ అభిప్రాయపడుతుందని ప్రజల్లో ఆయనకు ఉన్న పరిచయం, రాజకీయ అనుభవం ఎన్నికల సమయంలో సానుకూలంగా పనిచేసే అవకాశం ఉందని పార్టీ కార్యకర్తలే చెబుతున్నారు. పార్టీ టికెట్ ఇచ్చినా, ప్రత్యక్ష ఎన్నికల పరిస్థితి గజ్జి కృష్ణ మూర్తి యాదవ్ కు స్థానికంగా ఉన్న నాయకత్వం, అనుచరుల బలం కలిసి వస్తాయని టీడీపీ కార్యకర్తల ధీమా వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. సర్పంచ్ పదవి పై గజ్జి కృష్ణ మూర్తి యాదవ్ పేరు తెరపైకి రావడం స్థానిక రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. రిజర్వేషన్‌పై స్పష్టత, పార్టీ అధిష్ఠానం నిర్ణయం అనంతరం ఆయన రాజకీయ వ్యూహంపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది...

# కోడూరు పిఎసిఎస్ ఇన్చార్జి సీఈవోగా బడే సురేష్



**కోడూరు,సెప్టెంబర్ 7 (వార్తాప్రభ) :** కోడూరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఇన్చార్జి సీఈవోగా బడే వారిపాలెం పిఎసిఎస్ కార్యదర్శి బడే సురేష్ బాబు ను జిల్లా సహకార శాఖ అధికారులు నియమించారు. సోమవారం కోడూరు పిఎసిఎస్ సీఈవోగా సురేష్ బాబు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా పిఎసిఎస్ చైర్ పర్సన్ పూత బోయిన కరుణ్ కుమార్ ఇన్చార్జిగా బాధ్యతలు చేపట్టిన సురేష్ కు అభినందనలు తెలియజేశారు.

# కొత్త పింఛను దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం

● 07-09-2026 నుంచి 16-09-2026 వరకు కొత్త పెన్షన్ లకు దరఖాస్తులు స్వీకరణ

**జి.కొండూరు,సెప్టెంబర్ 7 (వార్తాప్రభ) :** ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకం కింద కొత్త పింఛన్ల కోసం అర్హులైన వృద్ధులు వితంతు వులు, ఒంటరి మహిళలు,వికలాంగులు,చేనేత కార్మికులు,మత్స్యకారులు, డప్పు కళాకారులు, సాంప్రదాయ చెప్పులు తయారీదారులు,ట్రాన్స్ జెండర్, కల్లు గీత కార్మికుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎంపీడివో బొజ్జగాని శ్రీనివాసరా వు సోమవారం ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మార్గదర్శకాలు ప్రకారం 07-09-2026 నుంచి 16-09-2026 వరకు కొత్త పెన్షన్ దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని తెలియజేశారు.స్వర్ణ గ్రామం కార్యాల యంలో దరఖాస్తు ఇవ్వాలని.దరఖాస్తుతో పాటు ఆధార్, రైస్ కార్డు/ఆదాయ ధృవీకరణ పత్రం మరియు సంబంధిత కేటగిరీ సర్టిఫికెట్లు ఇవ్వాల ని సూచించారు. స్వీకరించిన దరఖాస్తులను ఆన్లైన్లో నమోదు చేసి e-KYC పరిశీలన చేస్తారని ఎంపీడివో వెల్లడించారు. అర్హులైన దరఖాస్తులను భౌతిక పరిశీలనకు పంపించడం జరుగుతుం దని పేర్కొన్నారు.సంబంధిత శాఖ అధికారులు ఇంటి కి వచ్చి పత్రాలు, అర్హతలను తనిఖీ చేస్తారని తెలిపారు.అవసరమైతే వ–ఖ్జ కూడా అక్కడే పూర్తి చేస్తారని,తరువాత పూణా దరఖాస్తును పరిశీలించి అర్హత / అనర్హత నిర్ణయించడం జరుగుతుందని తెలియజేశారు. వృద్ధాప్యం, వితంతువు, ఒంటరి మహిళలు, వికలాంగులు దరఖాస్తులను సెర్ప్ సీఈవో కి, హ్యాండ్ లూమ్ మరియు టెక్స్టైల్స్,డప్పు కళాకారుల దరఖాస్తు లను సోషల్ వెల్ఫేర్ శాఖ కు, మత్స్యకారుల దరఖాస్తులను ఫిషరీస్,ట్రాన్స్ జెండర్ దరఖాస్తు లను హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ శాఖ కు, అలాగే కల్లు గీత కార్మికుల దరఖాస్తులను ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అధికారులకు పంపించడం జరుగుతుందని తెలిపారు.కొత్త పెన్షన్ మంజూరు చేసేది ఎంపీడివో కాదని కేవలం అర్హులైన దరఖాస్తులను మాత్రమే సిఫారసు చేస్తారని ఎంపీడీవో శ్రీనివాసరావు స్పష్టంచేశారు.

**రాష్ట్ర స్థాయి ప్రక్రియ:** సెర్ప్ ,ఆర్ టి జి ఎస్ మరియు సంబంధిత రాష్ట్ర శాఖలు తుది పరిశీలన చేస్తాయనీ, అనంతరం సెర్ప్ బడ్జెట్ ప్రతిపాదనను ప్రభుత్వా నికి పంపుతుందని తెలిపారు.ప్రభుత్వ అనుమతి మరియు బడ్జెట్ అందుబాటులో ఉన్న తరువాతే పెన్షన్ మంజూరు చేసి విడుదల చేయడం జరుగుతుందన్నారు.

**ముఖ్యమైన తేదీలు:**

07-09-2026 నుంచి 16-09-2026 వరకు దరఖాస్తుల స్వీకరణ మరియు e-KYC

17-09-2026 నుంచి 21-09-2026 వరకు సాధారణ అర్హత, భౌతిక/శాఖాపరమైన పరిశీలన

22-09-2026 నుంచి 24-09-2026 వరకు ఎంపీడీవో పరిశీలన మరియు సిఫారసు

25-09-2026 నుంచి 26-09-2026 వరకు బడ్జెట్ ప్రతిపాదన మరియు ప్రభుత్వ అనుమతి.

# జిల్లా అసిస్టెంట్ ఫుడ్ ఇన్స్పెక్టర్ గా రమేష్ బాబు



**కాకినాడ,సెప్టెంబర్ 7 (వార్తాప్రభ) :** ఎన్టీఆర్ జిల్లాలో గేజిటెడ్ ఫుడ్ ఇన్స్పెక్టర్ గా పనిచేస్తున్న ఎన్. రమేష్ బాబు పదోన్నతపై కాకినాడ జిల్లా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ గా నియమితులైయారు. ఈ సందర్భంగా ఆయన కాకినాడ కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్,జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ లను మర్యాదపూర్వకంగా కలిశారు.

# సూర్య ప్రకాష్ సేవలు మరవలేనివి



**కృత్తివెను,సెప్టెంబర్ 7 (వార్తాప్రభ) :** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇంతేరు నందు సోమవారం రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కొప్పినీడి సూర్యప్రకాష్ ను ఘనంగా సత్కరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సిహెచ్ జోసెఫ్ మాట్లాడుతూ కృత్తివెన్ను మండలానికి సూర్యప్రకాష్ సేవలు మరువలేనివని అన్నారు ఉపాధ్యాయులందరూ దుస్సాలువా తో వారిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యులు బొర్రా వీరాస్వామి సైతం ఆదినారాయణ,ఉండి పురుషోత్తం కిరణ్మయి శ్రీనివాసరావు చంద్రశేఖర్ అబ్దుల్ కరీం సత్యనారాయణ సంధ్యావలి రాజా కృష్ణ రేఖ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ దుర్గా పార్వతీ సమేత నాగేశ్వర స్వామి దేవస్థానంలో

## నూతన షెడ్డు నిర్మాణానికి భూమి పూజ....



**కృత్తివెన్ను,సెప్టెంబర్ 7 (వార్తాప్రభ) :** కృత్తివెన్ను మండలం గుడిదిబ్బ గ్రామంలో వేంచేసిన మహిమాన్విత దేవాలయం శ్రీ దుర్గా పార్వతీ సమేత నాగేశ్వర స్వామి వారి ఆలయములో గోపురం ఎదురుగా షెడ్డు నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ షెడ్డు నిర్మాణం దాతలు సహాయ సహకారాలతో నిర్మించబడుతుంది. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చేకూరి వెంకట్రావు, ధర్మకర్త బాడిత నాగబాబు ధర్మకర్త దాసరి వెంకట శ్రీనివాస్ రావు ధర్మకర్త బాలం శ్రీనివాస్ రావు ఆలయ అర్చకులు కోట మురళి కృష్ణ మోక రామకృష్ణ ఉండి నాగేశ్వరావు గుమస్తా ఆలపాటి నాగేశ్వరావు మరియు భక్తులు పాల్గొన్నారు...

# కొత్త పింఛన్లకు ఈ నెల 16లోగా దరఖాస్తు చేసుకోవాలి

● అర్హులైన వారు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి ● జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



**విజయవాడ,సెప్టెంబర్ 7 (వార్తాప్రభ) :** ఎన్‌టీఆర్ భరోసా పెన్షన్ పథకం కింద కొత్త పింఛన్లకు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైందని.. స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు కార్యాలయాల ద్వారా దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. దరఖాస్తు ఫారాలు స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు కార్యాలయాల్లో అందుబాటులో ఉంటాయని, అర్హులైన వారు ఈ నెల 16వ తేదీలోగా అవసరమైన ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకొని, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సోమవారం ఓ ప్రకటనలో సూచించారు. దరఖాస్తుల స్వీకరణ, ఆన్‌లైన్ నమోదు, ఈ–కేవైసీ ధ్రువీకరణ ప్రక్రియను ఏడు పనిదినాల్లో పూర్తిచేయాలని కాలపరిమితిని నిర్ణయించడం జరిగిందన్నారు. వృద్ధాప్య పెన్షన్, వితంతు, ఒంటరి మహిళ, దివ్యాంగులు, చేనేత కార్మికులు, మత్స్యకారులు, డప్పు కళాకారులు, సంప్రదాయ చెప్పుల తయారీదారులు, కల్లుగీత కార్మికులు, ట్రాన్స్‌జెండర్ పెన్షన్ కోసం అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అన్ని రకాల పెన్షన్లకు సాధారణంగా ఆధార్, రైస్ కార్డు/ఆదాయ ధ్రువీకరణపత్రం, సంబంధిత వర్గానికి అవసరమైన ధ్రువపత్రాలు సమర్పించాల్సి ఉంటుందన్నారు. దరఖాస్తుదారుల వివరాలు, సహాయక పత్రాలు, సాధారణ అర్హత, ఇప్పటికే ఉన్న పెన్షనర్ల డేటాబేస్, భౌతిక ధ్రువీకరణ నివేదిక, ఈ–కేవైసీ వివరాలు ఆధారంగా ఎంపీడీవో లేదా మున్సిపల్ కమిషనర్ దరఖాస్తులను పరిశీలిస్తారని.. అర్హత ఉన్న దరఖాస్తులను మాత్రమే సిఫార్సు చేస్తారన్నారు. ఈ దరఖాస్తులను రాష్ట్రస్థాయి పరిశీలనకు పంపడం జరుగుతుందని.. రాష్ట్రస్థాయిలో ఎస్‌జీఎస్‌డబ్ల్యూ, ఆర్‌టీజీఎస్, సెర్ప్ ద్వారా తుది పరిశీలన అనంతరం అర్హత కలిగిన దరఖాస్తులపై పెన్షన్ మంజూరుకు తదుపరి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. పీజీఆర్ఎస్ నందు ఇప్పటికే అర్జీని సమర్పించిన వారు కూడా తమ పరిధిలోని స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు కార్యాలయాల్లో అవసరమైన పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు.

# మర్యాదపూర్వక కలయిక

● తిరువూరు నియోజకవర్గ టిడిపి సీనియర్ లీడర్

● నెక్కలపు శ్రీనివాసరావు ( ఎన్టీవీ ప్రసాద్)



**విస్సన్నపేట,సెప్టెంబర్ 7 (వార్తాప్రభ) :** తిరువూరు నియోజకవర్గ టిడిపి సీనియర్ లీడర్ శ్రీనివాసరావు నెక్కలపు (ఎన్టీవీ ప్రసాద్) ఎమ్మెల్సీ వర్ల రామయ్యను మర్యాదపూర్వకంగా కలిసి పట్టు శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. వర్ల రామయ్య అంటే అపార అనుభవం కలిగిన వ్యక్తి అని అజాతశత్రువు అని ఎన్టీవీ ప్రసాద్ కొనియాడారు.

# బహుజన అభివృద్ధి కోసం ఐక్యమత్యంతో కృషి చేద్దాం

● బి.సి. వర్గాలకు చెందిన ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలకు ఘన సన్మాన సభ లో బి.సి.నేత పిన్నిక లక్ష్మీప్రసాద్ యాదవ్



**మార్కాపురం,సెప్టెంబర్ 7 (వార్తాప్రభ) :** నూతన మార్కాపురం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత అయినటువంటి బీసీ మిత్రులు కదం శ్రీనివాసరావు మరియు మండల రామాంజనేయులు వాల్మీకి లకు సోమవారం సాయంత్రం స్థానిక బీసీ భవన్ లో ఘన సన్మానం జరిగింది. ఈ సన్మాన కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి పిన్నిక లక్ష్మీప్రసాద్ యాదవ్ కార్యవర్గ సభ్యులు ఎల్లారి రంగస్వామి గౌడ్ నిర్వహించారు. వెనుకబడిన మార్కాపురం ప్రాంతంలో జిల్లా ఏర్పడిన తర్వాత మొట్టమొదటిసారిగా ఇచ్చినటువంటి జిల్లా స్థాయి ఉత్తం ఉపాధ్యాయ అవార్డులు గ్రహించినటువంటి పై ఇరువురు ఎంతో అభినందనీయులని పి ఎల్ పి యాదవ్ తెలియజేశారు అనేక సంవత్సరాలుగా మారుమూల ప్రాంతాలైనటువంటి పెద్దారవీడు మండలం మార్కాపురం మండలం లాంటి ప్రాంతాల్లో తమ సేవలో అందిస్తూ వివిధ వర్గాల ప్రజల యొక్క పిల్లలు విద్యాభ్యాసం కోసం పట్టణ ప్రాంతాలకు వెళ్లకుండా వారు వారు ఉపాధ్యాయులుగా సేవలందిస్తున్నటువంటి గ్రామాల పాఠశాలల్లోనే ఉన్నత విద్యను అందించడంతోపాటు పాఠశాల అభివృద్ధితోపాటు ఆ గ్రామాల అభివృద్ధి కూడా తమ వంతుగా కృషిచేసి ప్రోత్సహించినటువంటి చరిత్రపై ఇరువురికి ఉందని తెలియజేశారు ఆగస్టు 31వ తేదీ 2026వ సంవత్సరంలో ఉపాధ్యాయునిగా పదవీ విరమణ పొందినటువంటి కదం శ్రీనివాసరావు మాట్లాడుతూ తాను అనేక మైనటువంటి సేవా కార్యక్రమాల్లో నిమగ్నమై పలువురి ప్రశంశాల అందుకున్నటువంటి చరిత్ర కలిగి ఉన్నానని విద్యా వ్యవస్థలో మార్పులు తీసుకొచ్చేందుకు విద్యార్థినీ విద్యార్థుల యొక్క భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు తన వంతుగా కృషి చేశానని తెలియజేశారు ప్రస్తుతం మానవతా స్వచ్ఛంద సేవా సంస్థలో సభ్యునిగా సేవలు అందిస్తున్నారని బిసి భవన్ కమిటీ వారి యొక్క వివిధ కార్యక్రమాలకు ఇప్పటివరకు తోడ్పాటు అందిస్తూ వస్తున్నానని ఇప్పటినుండి పూర్తి సమయాన్ని బీసీల అభివృద్ధి కూడా కేటాయిస్తానని వారు తెలియజేశారు అదేవిధంగా సన్మానాన్ని పొందినటువంటి మరొక ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత జాతీయస్థాయిలో విద్యాభ్యాసాన్ని విద్యార్థిని విద్యార్థులకు లభించడానికి మెలకువలు ట్రైనింగ్ పొంది వచ్చినటువంటి వాల్మీకి సామాజిక వర్గంలో గుర్తింపు పొందినటువంటి వ్యక్తిగా ఉన్న మండల రామాంజనేయులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తూ విద్యార్థిని విద్యార్థులు ప్రైవేటు పాఠశాలల వైపు చూడకుండా ఉండేందుకు తమ వంతుగా వారికి విద్యాభ్యాసాన్ని అందించామని భవిష్యత్తులో బీసీ సంఘ కార్యక్రమాలకు అండగా నిలుస్తానని 2011లో మార్కాపురంలో ఏర్పాటు చేసినటువంటి బీసీ భవన్ కమిటీలో సభ్యుడిగా ఉన్నానని అది ఇంకా కొనసాగిస్తానని తెలియజేశారు..... సన్మాన కార్యక్రమం అనంతరం పలువురు వ్యక్తులు మాట్లాడుతూ మార్కాపురం జిల్లా కేంద్రంలో ఉన్నటువంటి బీసీ భవన్ ఇప్పటివరకు చేసినటువంటి సేవలకు అదనంగా భిన్నంగా బీసీ వర్గాల తో పాటు మిగతా వర్గాల వారికి కూడా అవసరర్థులందరికీ అండగా నిలవాలని తామందరం బీసీ భవన్ కు పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని తెలియజేశారు. మార్కాపురం అన్ని రంగాల్లో వెనుకబడి ఉందన్నటువంటి వార్తలు నుండి ఈరోజు జిల్లా కేంద్రమైనటువంటి పరిస్థితుల్లో వెలుగొండ ప్రాజెక్టు వచ్చినటువంటి పరిస్థితులు త్వరలో రానున్నటువంటి మెడికల్ కాలేజీ ప్రారంభోత్సవంలో అనేక సేవా కార్యక్రమాల్లో కూడా పాల్గొని ఈ ప్రాంతంలో ఉన్నటువంటి బహుజనుల యొక్క ఉన్నతి కోసం అందరం కలిసికట్టుగా కృషి చేద్దామని మిగతా ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ వర్గాల అందరిని కలుపుకొని సమాజంలో ఉన్నటువంటి అన్ని వర్గాల వారి యొక్క మనలను పొందుతూ మన వర్గం వారి ఉన్నతికి పాటుపడదామని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో మాట్లాడిన వారిలో కో-ఆపరేటివ్ డిపార్ట్మెంట్లో గ్రూప్ 2 అధికారిగా ఉన్నటువంటి అసిస్టెంట్ రిజిస్టర్ దేవుండ్ల బాలయ్య, మాజీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వెటర్నరీ డిపార్ట్మెంట్ లైవ్ స్టాక్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షులు పాలెం చెంచయ్య, మాజీ సైనిక అధికారి బిజెపి నాయకులు మొర్రిబోయిన చిన్నయ్య ముదిరాజ్, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ నాలి కొండయ్య యాదవ్, మాజీ ఎంపీటీసీ వాల్మీకి సేవా సంఘం రాష్ట్ర నాయకులు మాజీ పోలయ్య వాల్మీకి, మాజీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ రాష్ట్ర వాల్మీకి సంఘ బాధ్యులు నల్లబోతుల కొండయ్య, వాల్మీకి రిటైర్డ్ ఏఎస్ఐ మెట్ల చెంచయ్య యాదవ్ గౌడ, గౌడ ఉద్యోగుల సంఘం నాయకులు వెంకటేశ్వర్లు గౌడ్, నాయి బ్రాహ్మణ ఉద్యోగ సంఘ నాయకులు వంకేశ్వరం శ్రీనివాస్, సూర్య బలిజ సంఘం నాయకులు ఆరు పురుషోత్తం, నాయి బ్రాహ్మణ సంఘ నాయకులు రంగారావు, ఈర్ల రాజశేఖర్ యాదవ్, నాగం రామకృష్ణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సన్మాన కార్యక్రమాన్ని ఇంత ఘనంగా ఏర్పాటు చేసినందుకు కదం శ్రీనివాసరావు, మండల రామాంజనేయులు బిసి భవన్ సభ్యులకు అభినందనలు తెలియజేశారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించినందుకు అందరినీ అభినందించారు.

# రాజీవ్ గృహకల్ప భూముల ఆక్రమణ యత్నం

● రంగారెడ్డి బండ వద్ద కోట్ల విలువైన స్థలంపై కన్నేసిన ఆక్రమణదారులు

● ప్రభుత్వ భూమిని తక్షణమే పరిరక్షించాలని స్థానికుల డిమాండ్







**కుత్బుల్లాపూర్,సెప్టెంబర్ 7 (వార్తాప్రభ) :** కుత్బుల్లాపూర్ మండలం, పేట్‌బషీరాబాద్ పరిధిలోని సర్వే నంబర్ 25/1 రంగారెడ్డి బండ ప్రాంతంలో రాజీవ్ గృహకల్పకు కేటాయించిన కోట్ల విలువైన ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురవుతున్నాయన్న ఆరోపణలు స్థానికంగా కలకలం రేపుతున్నాయి.

**రాత్రికి రాత్రే షెడ్ల నిర్మాణం..** సుమారు 5 ప్లాట్లకు సంబంధించిన దాదాపు 500 గజాల ప్రభుత్వ స్థలాన్ని కొందరు ఆక్రమించేందుకు యత్నిస్తున్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు. ప్రస్తుత బహిరంగ విపణిలో ఈ భూమి విలువ గజానికి రూ. లక్షకు పైగానే ఉంటుందని అంచనా. ఇదే ప్రాంతానికి సమీపంలో ఉన్న మరో 1,000 గజాల కమర్షియల్ స్థలంలో ఆనంద్ అనే వ్యక్తి రాత్రికి రాత్రే చిన్నపాటి షెడ్ నిర్మించి కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నాడని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ కబ్జా యత్నాలకు కొంతమంది స్థానిక రాజకీయ నేతలు, వారి అనుచరుల అండదండలు ఉన్నాయనే ప్రచారం జోరుగా సాగుతోంది.

**విచారణ చేపట్టి భూములను కాపాడాలి..** ఈ అక్రమాలపై ఉన్నతాధికారులు నిష్పక్షపాతంగా విచారణ జరిపి వాస్తవాలను నిగ్గుతేల్చాలని ప్రజలు కోరుతున్నారు. జీహెచ్ఎంసీ, రెవెన్యూ, హౌసింగ్ శాఖల ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి ప్రభుత్వ భూమి హద్దులను నిర్ధారించాలని, రికార్డులు, పహాణీ వివరాలను పరిశీలించి అక్రమ నిర్మాణాలపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వ భూమిని సుమోటోగా స్వీకరించి పరిరక్షించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని స్థానిక ప్రజలు స్పష్టం చేశారు.

# నేత్రదానంతో ఇద్దరి జీవితాల్లో వెలుగు

● యువతలో నేత్రదానంపై అవగాహన పెరగాలి: డా. సమరం ● నలంద డిగ్రీ కళాశాలలో అవగాహన సదస్సు






**విజయవాడ,సెప్టెంబర్ 7 (వార్తాప్రభ) :** మరణానంతరం నేత్రదానం చేయడం ద్వారా ఇద్దరు అంధుల జీవితాల్లో వెలుగులు నింపవచ్చని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఎన్‌టీఆర్ జిల్లా చైర్మన్ డా. సమరం అన్నారు. నేత్రదానం మహత్తరమైన మానవతా సేవ అని, దీనిపై యువతలో విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. విజయవాడలోని నలంద డిగ్రీ కళాశాలలో నేత్రదానంపై నిర్వహించిన అవగాహన సదస్సుకు డా. సమరం ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. కళాశాల ప్రిన్సిపాల్ శ్రీమతి అనురాధ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సుమారు 100 మంది విద్యార్థులు, యువ రెడ్‌క్రాస్ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డా. సమరం మాట్లాడుతూ, మరణానంతరం మన నేత్రాలను దానం చేయడం ద్వారా చూపులేని వారికి కొత్త ప్రపంచాన్ని అందించే అవకాశం ఉంటుందన్నారు. నేత్రదానం కేవలం అవయవదానం మాత్రమే కాదని, మరొకరి జీవితంలో వెలుగులు నింపే గొప్ప మానవతా సేవ అని పేర్కొన్నారు. యువత సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ సమాజంలో సేవాభావం, మానవతా విలువలను పెంపొందించాలని పిలుపునిచ్చారు. డా. సమరం ప్రసంగంతో స్ఫూర్తి పొందిన పలువురు విద్యార్థులు నేత్రదాన ప్రతిజ్ఞ చేసేందుకు ముందుకు వచ్చారు. నేత్రదాన ఉద్యమంపై తమ కుటుంబ సభ్యులు, స్నేహితులు, సమాజంలో విస్తృతంగా ప్రచారం చేస్తామని తెలిపారు. సదస్సులో స్వేచ్ఛ గోరా ఐ బ్యాంక్ మూడు దశాబ్దాల నేత్రదాన ఉద్యమ ప్రస్థానంపై రూపొందించిన వీడియో గీతాన్ని ప్రదర్శించారు. గత 30 సంవత్సరాలుగా నేత్రదానంపై అవగాహన పెంపొందించేందుకు స్వేచ్ఛ గోరా ఐ బ్యాంక్ చేస్తున్న కృషిని విద్యార్థులు అభినందించారు. కార్యక్రమంలో వై. వెంకటేశ్వరరావు, బి. సుబ్బారావు, డి. రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# 2 లక్షల సీడ్‌బాల్స్‌తో పచ్చదనానికి బాట

● వన్ ఎర్త్--వన్ లైఫ్ ఆధ్వర్యంలో వినూత్న కార్యక్రమం ● కలెక్టర్‌కు సీడ్‌బాల్స్ అందజేత



**విజయవాడ,సెప్టెంబర్ 7 (వార్తాప్రభ) :** పచ్చదనం పెంపు, జీవవైవిధ్య పరిరక్షణ, పర్యావరణ సమతుల్యత సాధనే లక్ష్యంగా "వన్ ఎర్త్--వన్ లైఫ్" ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థులు, ఓ.ఈ.-ఓ.ఎల్. వాలంటీర్ టీం తయారు చేసిన 2 లక్షల సీడ్‌బాల్స్‌ను ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ జి. లక్ష్మీశ కు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ జి. లక్ష్మీశ మాట్లాడుతూ.. సీడ్‌బాల్స్ ద్వారా ప్రకృతి పునరుత్పత్తికి, పచ్చదనం పెంపునకు అవకాశం కలుగుతుందని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ కోసం "వన్ ఎర్త్--వన్ లైఫ్" సంస్థ చేస్తున్న కార్యక్రమాలు అభినందనీయమన్నారు. విద్యార్థులు, మహిళలు, యువతను పర్యావరణ కార్యక్రమాల్లో భాగస్వాములను చేయడం ద్వారా సమాజంలో పర్యావరణ స్పృహ పెంపొందుతుందని పేర్కొన్నారు. "వన్ ఎర్త్--వన్ లైఫ్" ఫౌండర్ అండ్ అడ్మిన్ లీలా కుమారి ఏలూరి మాట్లాడుతూ నగరాల్లో పచ్చదనం పెంచడంతో పాటు, ప్రతి ఇంటికీ పర్యావరణ పరిరక్షణను చేరువ చేయాలనే ఉద్దేశంతో తమ సంస్థ నిరంతరం కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. ముఖ్యంగా మిద్దె తోటలను ప్రోత్సహిస్తూ, గృహిణులకు మిద్దె తోటల పెంపకం, ఇంటి వ్యర్థాలతో కంపోస్టు తయారీ, పర్యావరణ పరిరక్షణ అంశాలపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. కాలుష్య నియంత్రణ, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, ప్లాస్టిక్ బ్యాన్‌పై ప్రజల్లో అవగాహన కల్పించడం, పరిశుభ్రత, రీసైక్లింగ్ వంటి అంశాలపై ప్రజలను చైతన్యవంతం చేస్తున్నామని చెప్పారు. అంతరించిపోతున్న దేశవాళీ విత్తనాలను సంరక్షిస్తూ, వాటిని ప్రజలకు ఉచితంగా పంపిణీ చేస్తున్నామని, తద్వారా సంప్రదాయ విత్తన సంపదను భవిష్యత్ తరాలకు అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. విద్యార్థులకు చిన్న వయస్సు నుంచే మైక్రో గార్డెనింగ్, మొక్కల పెంపకం, విత్తనాల సంరక్షణ, వ్యర్థాల విభజన, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తున్నామని లీలా కుమారి ఏలూరి వివరించారు. పిల్లల్లో ప్రకృతి పట్ల బాధ్యతను పెంపొందించడం ద్వారా భవిష్యత్ తరాలను పర్యావరణహిత జీవన విధానం వైపు నడిపించవచ్చన్నారు. ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లో 'ధన్వంతరి వనం' పేరుతో ఔషధ మొక్కలను నాటే కార్యక్రమాన్ని కూడా వన్ ఎర్త్--వన్ లైఫ్ ఆధ్వర్యంలో చేపట్టామని ఆమె తెలిపారు. కలెక్టరేట్ ప్రాంగణంలో 60 ఔషధ మొక్కలను నాటి, వాటి ఉపయోగాలపై అవగాహన కల్పించామని చెప్పారు. పర్యావరణ పరిరక్షణ అనేది ఒక్కరోజు కార్యక్రమం కాదని, ప్రతి కుటుంబం, విద్యార్థి, మహిళ తమ రోజువారీ జీవితంలో భాగంగా చేసుకోవాల్సిన బాధ్యత అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా 2 లక్షల సీడ్‌బాల్స్‌ను అనుకూలమైన కొండలు, అటవీ, బంజరు ప్రాంతాల్లో డ్రోన్‌ల ద్వారా వెదజల్లి, సహజంగా విత్తనాలు మొలకెత్తేలా చర్యలు చేపట్టనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో లీలా కుమారి ఏలూరి, ఆల్ ఓ, ఈ.-ఓ.ఎల్. వాలంటీర్ టీం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి లంక నాగేశ్వరరావు కు పితృవియోగం



**జి.కొండూరు,సెప్టెంబర్ 7 (వార్తాప్రభ) :** జి.కొండూరు మండల తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి కుంటముక్కల గ్రామానికి చెందిన లంక నాగేశ్వరరావు (నాని) కి పితృవియోగం కలిగింది. ఆయన తండ్రి లంక కోటేశ్వరరావు (84) వృద్ధాప్య సంబంధిత అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం తుది శ్వాస విడిచారు. కోటేశ్వరరావు మృతి చెందిన విషయం తెలుసుకున్న బంధువులు కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు కోటేశ్వర రావు భౌతికకా యాన్ని సందర్శించి తమ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. అనంతరం లంక నాగేశ్వరరావు కుటుంబానికి మనోధైర్యం కల్పిస్తూ కోటేశ్వరరావు ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

# జిల్లాలో వినాయక ఉత్సవాలను అత్యంత భక్తి ప్రపత్తులతో, ప్రశాంత వాతావరణంలో జరుపుకుందాం

● పర్యావరణహిత మట్టి విగ్రహాల ఏర్పాటుకు ప్రతి ఒక్కరూ సహకరించాలి ● సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేసి గణేష్ ఉత్సవాలను విజయవంతం చేయాలి ● ... జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ





**విజయవాడ,సెప్టెంబర్ 7 (వార్తాప్రభ) :** జిల్లాలో గణేష్ ఉత్సవాలను అత్యంత వైభవంగా, భక్తి ప్రపత్తులతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ ఆదేశించారు. గణేష్ ఉత్సవాల నిర్వహణలో ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ అవసరమైన అన్ని ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లాలో గణేష్ ఉత్సవాల నిర్వహణకు తీసుకోవాల్సిన చర్యలపై సోమవారం కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అధ్యక్షతన సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, గణేష్ ఉత్సవ సమితి సభ్యులతో ఉత్సవాల నిర్వహణ, వినాయక ప్రతిమల ఏర్పాటు, పందిళ్లకు అనుమతులు, విద్యుత్ భద్రత, అగ్నిమాపక భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, నిమజ్జన ఏర్పాట్లు, పారిశుద్ధ్యం తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ మాట్లాడుతూ, గత సంవత్సరం జిల్లాలో ఐదు లక్షల మట్టి వినాయక విగ్రహాలను తయారు చేసి ప్రపంచ రికార్డు సాధించడంతో పాటు, గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా నిర్వహించామని తెలిపారు. అదే స్ఫూర్తిని కొనసాగిస్తూ ఈ ఏడాది కూడా గణేష్ ఉత్సవాలను ఘనంగా, భక్తి శ్రద్ధలతో, ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఉత్సవ కమిటీలు, నిర్వాహకులు నిబంధనలను పాటిస్తూ అధికారులకు సహకరించాలని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఉత్సవాలను నిర్వహించాలని సూచించారు. వినాయక చవితి పందిళ్ల ఏర్పాటుకు అవసరమైన అనుమతుల ప్రక్రియపై నిర్వాహకులకు పూర్తి అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పందిళ్ల ఏర్పాటుకు ముందుగానే స్థలాలను పరిశీలించి, భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నారా లేదా అనే అంశాలను తనిఖీ చేయాలని సూచించారు. రెవెన్యూ, మున్సిపల్, పోలీస్, విద్యుత్, ఆర్‌అండ్‌బీ, అగ్నిమాపక శాఖల అధికారులు సమన్వయంతో ఒక బృందంగా పనిచేసి పందిళ్లను ముందస్తుగా తనిఖీ చేసి ధ్రువీకరించాలని ఆదేశించారు. నిబంధనలకు అనుగుణంగా మాత్రమే పందిళ్లను ఏర్పాటు చేసుకునేలా నిర్వాహకులకు సూచనలు ఇవ్వాలని తెలిపారు. పందిళ్ల నిర్మాణంలో భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించేలా చూడాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు పందిళ్ల నిర్మాణ పటిష్టతను ముందస్తుగా తనిఖీ చేయాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు సులభంగా బయటకు వెళ్లే విధంగా మార్గాలను అందుబాటులో ఉంచాలని, పందిళ్ల ఏర్పాటుతో ప్రజల రాకపోకలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజలకు, వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలిగే విధంగా పందిళ్లను ఏర్పాటు చేయరాదని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. ముఖ్యంగా ప్రధాన రహదారులను పూర్తిగా లేదా పాక్షికంగా మూసివేసేలా పందిళ్లను ఏర్పాటు చేయడానికి ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించరాదని అధికారులను ఆదేశించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పోలీస్ శాఖ అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. గణేష్ పందిళ్ల వద్ద విద్యుత్ ప్రమాదాలు జరగకుండా విద్యుత్ శాఖ అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. షార్ట్ సర్క్యూట్‌కు అవకాశం లేకుండా వైరింగ్, విద్యుత్ కనెక్షన్లు, ఇతర విద్యుత్ పరికరాలను పరిశీలించాలని సూచించారు. విద్యుత్ తీగలు, కనెక్షన్లు ప్రజలకు ప్రమాదకరంగా లేకుండా తగిన భద్రతా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గణేష్ ఉత్సవాల్లో డీజే, సౌండ్ సిస్టమ్స్‌ను నిర్ణయించిన పరిమితులకు లోబడి మాత్రమే వినియోగించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. అధిక శబ్దంతో పందిళ్ల చుట్టుపక్కల నివసించే ప్రజలు, వృద్ధులు, చిన్నారులు, విద్యార్థులు ఇబ్బందులు పడకుండా నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రశాంత వాతావరణానికి భంగం కలగకుండా ఉత్సవాలను నిర్వహించాలని తెలిపారు. గణేష్ పందిళ్ల వద్ద పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ప్రతి పందిరి వద్ద మున్సిపల్, పంచాయతీ అధికారులు తప్పనిసరిగా డస్ట్‌బిన్లను ఏర్పాటు చేయాలని సూచించారు. పందిళ్ల వద్ద పేరుకుపోయే వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించేలా చర్యలు తీసుకోవాలని, ఉత్సవాల అనంతరం పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. గణేష్ విగ్రహాల నిమజ్జనానికి అనువైన ప్రదేశాలను ముందుగానే గుర్తించి అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. నిమజ్జన ప్రాంతాల్లో డస్ట్‌బిన్లు, క్రేన్లు, బోట్లు తదితర అవసరమైన పరికరాలను ముందస్తుగా ఏర్పాటు చేయాలని సూచించారు. నిమజ్జనం సందర్భంగా భక్తులకు, నిర్వాహకులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మట్టి వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. రంగులు, ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన విగ్రహాల వల్ల నీటి వనరులు కలుషితం కావడం, తద్వారా ప్రజారోగ్యం, జలచరాలపై ప్రభావం పడే అవకాశం ఉందని ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని ఇగ్నైట్ సెల్‌లో మట్టి వినాయక ప్రతిమలను అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పందిళ్ళ వద్ద ప్రసాదాల తయారీ, నిల్వ, పంపిణీ విధానాలను పరిశీలించాలని ఆదేశించారు. నాణ్యత లేని లేదా ఎక్కువ కాలం నిల్వ ఉంచిన ప్రసాదాలను పంపిణీ చేయడం వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నందున నిర్వాహకులకు ముందస్తుగా అవగాహన కల్పించాలని తెలిపారు. ఆహార భద్రతా నిబంధనలను ఉల్లంఘించే వారిపై నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గణేష్ ఉత్సవ సమితి సభ్యులు మాట్లాడుతూ జిల్లాలో గణేష్ పందిళ్ల వద్ద ఏర్పాటు చేసిన కమిటీలతో ఇప్పటికే ముందస్తు సమావేశాలు నిర్వహించి ఉత్సవాల నిర్వహణకు సంబంధించిన పలు అంశాలపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ పర్యావరణహితమైన మట్టి వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. అధికార యంత్రాంగానికి, ఉత్సవ కమిటీలకు మధ్య సమన్వయంతో ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు పూర్తి సహకారం అందిస్తామని పేర్కొన్నారు. గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా, సురక్షితంగా, పర్యావరణహితంగా నిర్వహించేందుకు రెవెన్యూ, మున్సిపల్, పోలీస్, విద్యుత్, ఆర్‌అండ్‌బీ, అగ్నిమాపక, ఆహార తనిఖీ, పంచాయతీ తదితర శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ప్రజల భద్రత, సౌకర్యం, పర్యావరణ పరిరక్షణకు అత్యధిక ప్రాధాన్యతనిస్తూ ఉత్సవాలను విజయవంతం చేయాలని, నిబంధనలను ఉల్లంఘించే వారిపై తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, జిల్లా విద్యుత్ శాఖ అధికారి యు.హనుమయ్య, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి ఏవి.శంకర్రావు, జిల్లా ఆర్‌అండ్‌బీ అధికారి, గణేష్ ఉత్సవ సమితి సభ్యులు బిట్ర వెంకటేష్, వై. కిషోర్, లోయ బాలకృష్ణ, జీవీఎస్ రమణమూర్తి, వి. పల్లప రాజు, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada, Andhra Pradesh and Published from D.No.30-22-3/11, Beside Union Bank Of India, Kotha Vantena Road, Seetaramapuram, Vijayawada - 520004, A.P. Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188